PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 321 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శనివారం 14 నవంబర్ 2026

కాకతీయ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్వ్యూ నైపుణ్యాలపై శిక్షణ కార్యక్రమం..



3లో

ఫాదర్ తాటికొండ జోసెఫ్‌కు డాక్టరేట్ ప్రదానం



3లో

ఘనంగా జాతీయ క్రీడా పురస్కారాల ప్రదానం

- 15 మంది క్రీడాకారులకు అర్జున అవార్డులు అందజేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



న్యూఢిల్లీ,నవంబర్ 13 (పీసీడబ్ల్యూ న్యూస్): క్రీడా రంగంలో విశేష ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు, కోచ్‌లకు అందించే జాతీయ క్రీడా పురస్కారాలు-2025 ప్రదానోత్సవం శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో ఘనంగా జరిగింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విజేతలకు అవార్డులు అందజేసి సత్కరించారు. మొత్తం 15 మంది క్రీడాకారులు అర్జున అవార్డులు అందుకున్నారు.డెకాథ్లాన్ అథ్లెట్ తేజస్విన్ శంకర్, ఫిడే

మిగతా2లో...

తెలంగాణను పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

● యువతకు ఉపాధి అవకాశాల కల్పనే భారత్ సమ్మిట్ ఉద్దేశం ● 70 దేశాల నుంచి వెయ్యి మంది ప్రతినిధుల రాక ● వీసాల నిరాకరణపై కేంద్రంపై సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు



హైదరాబాద్,నవంబర్ 13 (పీసీడబ్ల్యూ న్యూస్): తెలంగాణను పెట్టుబడులకు అనుకూలమైన రాష్ట్రంగా తీర్చిదిద్ది, యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడమే భారత్ సమ్మిట్ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. భారత్ సమ్మిట్‌కు హాజరయ్యేందుకు వివిధ దేశాల నుంచి వస్తున్న ప్రతినిధుల వీసాలను కేంద్ర ప్రభుత్వం తిరస్కరించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఈ చర్యకు బీజేపీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు.భారత్ సమ్మిట్‌కు 70 దేశాల నుంచి సుమారు వెయ్యి మంది ప్రతినిధులు హాజరయ్యారని తెలిపారు. వివిధ రంగాలకు

మిగతా2లో...



ప్రపంచ ప్రగతిశీల నేతల వేదికగా హైదరాబాద్

హెచ్‌ఐసీసీలో భారత్ సమ్మిట్-2.0 సందడి

70 దేశాల నుంచి వెయ్యి మందికి పైగా ప్రతినిధులు

ప్రజాస్వామ్యం, ఆర్థిక వ్యవస్థ, వాతావరణ మార్పులపై చర్చలు

నేడు ముగింపు సమావేశంలో రాహుల్‌గాంధీ ప్రసంగం

హైదరాబాద్,నవంబర్ 13 (పీసీడబ్ల్యూ న్యూస్): ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్య విలువలు, ఆర్థిక సహకారం, సామాజిక న్యాయం, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలపై చర్చించేందుకు హైదరాబాద్ వేదికగా భారత్ సమ్మిట్-2.0 శుక్రవారం ప్రారంభమైంది. హెచ్‌ఐసీసీలో రెండు రోజులపాటు జరిగే ఈ అంతర్జాతీయ సదస్సుకు భారత్‌తో పాటు సుమారు 70 దేశాల నుంచి వెయ్యి మందికి పైగా

మిగతా2లో...

ఎంఒయులు ఆచరణలోకి రావాలి

విశాఖ,నవంబర్ 13 (పీసీడబ్ల్యూ న్యూస్): పెట్టుబడులు కేవలం ఒప్పందాలకే పరిమితం కాకుండా ఆచరణ రూపం దాల్చాలని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ అన్నారు. 'కలిసి పనిచేద్దాం.. కలిసి ఎదుగుదాం.. సంపదను పంచుకుందాం' అనే విధానంతో ముందుకు సాగాలని సూచించారు. విశాఖలో రెండు రోజుల పాటు

మిగతా2లో...

సీఐఐ సదస్సు ముగింపులో ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్



రూ.3 లక్షల కోట్లతో ఏపీలో రహదారుల అభివృద్ధి

- సిఐఐ సదస్సులో వెల్లడించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

విశాఖ,నవంబర్ 13 (పీసీడబ్ల్యూ న్యూస్):ఆంధ్రప్రదేశ్‌లో సుమారు రూ.3 లక్షల కోట్లతో రహదారి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు చేపడుతున్నట్లు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. విశాఖపట్నంలో జరుగుతున్న 31వ సిఐఐ భాగస్వామ్య సదస్సులో ఆయన మాట్లాడుతూ.. 2014లో రాష్ట్రంలో 4,100 కిలోమీటర్లుగా ఉన్న జాతీయ రహదారుల నెట్‌వర్క్ ప్రస్తుతం 8,700 కిలోమీటర్లకు పెరిగిందన్నారు. రూ.14 వేల కోట్లతో

మిగతా2లో...



భావితరాల భవిష్యత్తు కోసమే భారత్ ఫ్యూచర్ సిటీ

● సుస్థిరాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం

● పెట్టుబడులకు అన్ని విధాలా సహకరిస్తాం: మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్,నవంబర్ 13 (పీసీడబ్ల్యూ న్యూస్): భావితరాల అవసరాలకు అనుగుణంగా సుస్థిరాభివృద్ధికి పెద్దపీట వేస్తూ భారత్ ఫ్యూచర్ సిటీని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. వేగంగా పెరుగుతున్న పట్టణీకరణతో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేలా నెట్‌జీరో లక్ష్యంతో పర్యావరణ హిత నగరంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. భారత్ సమ్మిట్-2.0లో భాగంగా హైదరాబాద్ హైటెక్స్‌లో శుక్రవారం నిర్వహించిన 'ఫ్యూచర్ సిటీ-పట్టణీకరణ' చర్చాగోష్ఠిలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ నగరాలు

మిగతా2లో...

నగర భద్రతకు పెద్దపీట.. కొత్త సీపీ మహేష్ భగవత్

శాంతిభద్రతలు, మహిళా రక్షణ, ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి

నేరస్తులపై కఠిన చర్యలు.. అక్రమ వసూళ్లకు పాల్పడితే కేసులు



2లో

నీటి లభ్యత ఆధారంగా యాసంగి పంటల ఎంపిక

● జిల్లాల వారీగా పకడ్బందీ సాగు ప్రణాళిక రూపొందించాలి

● విత్తనాలు ముందుగానే సిద్ధం చేయాలి

● కూరగాయలు, పప్పుధాన్యాల సాగుకు ప్రోత్సాహం

● కలెక్టర్లకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాలు



హైదరాబాద్,నవంబర్ 13 (పీసీడబ్ల్యూ న్యూస్): రాష్ట్రంలో రబీ పంటల సాగు ప్రణాళికను పకడ్బందీగా రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రతి జిల్లాలో స్థానిక పరిస్థితులు, నీటి లభ్యతకు అనుగుణంగా అనువైన పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి సీనియర్ అధికారులతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయం, ఉద్యానవన శాఖ, సూక్ష్మ సేద్యం, బిందు సేద్యం, కూరగాయలు, పప్పుధాన్యాల సాగు, ధాన్యం కొనుగోళ్లు తదితర అంశాలపై సమీక్షించారు. ఎల్‌నినో ప్రభావం, మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటి లభ్యత ఆధారంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. రైతులకు అవసరమైన విత్తనాలను ముందుగానే సిద్ధం చేసి సకాలంలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కూరగాయలు, పప్పుధాన్యాల సాగును

మిగతా2లో...

మోదీతో బహిరంగ చర్చకు రాహుల్ సవాల్

ఫోన్ ట్యాపింగ్ జరుగుతోందని ఆరోపణలు

నా దగ్గర ఆధారాలున్నాయి.. ముఖాముఖి చర్చకు సిద్ధం

కాంగ్రెస్ నేత వ్యాఖ్యలను ఖండించిన బీజేపీ



న్యూఢిల్లీ,నవంబర్ 13 (పీసీడబ్ల్యూ న్యూస్): ప్రధాని నరేంద్ర మోదీ తన ఫోన్‌ను ట్యాప్ చేయిస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. తన ఆరోపణలకు సంబంధించిన ఆధారాలన్నీ ఫోన్‌లోనే ఉన్నాయని వెల్లడించారు. శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్‌లో నిర్వహించిన 'ఆస్క్ మీ' కార్యక్రమంలో నెటిజన్ల ప్రశ్నలకు సమాధానమిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. తన ఫోన్‌ను పైకెత్తి చూపిస్తూ, తనపై నిఘా ఉన్న విషయం ప్రధానికి కూడా తెలుసని పేర్కొన్నారు.ప్రధాని మోదీ

మిగతా2లో...

సిద్దిపేటలో రాజకీయ సమరానికి కవిత సన్నద్ధం!

హరీశ్‌రావును ప్రజాజీవితం నుంచి తరిమికొట్టే వరకు పోరాటం

మున్సిపల్ ఎన్నికల నుంచే కార్యాచరణ ప్రారంభం

కాళేశ్వరం, మల్లన్నసాగర్ పనులపై తీవ్ర ఆరోపణలు


2లో

తెలంగాణను పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

చెందిన నిపుణులు, ప్రముఖులు, జర్నలిస్టులను ఆహ్వానించి రెండు రోజులపాటు చర్చలు, సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. తెలంగాణలోని పెట్టుబడి అవకాశాలు, పారిశ్రామిక విధానాలు, వాతావరణ పరిస్థితులు, మౌలిక వసతులు, మానవ వనరులను అంతర్జాతీయ ప్రతినిధులకు వివరించడమే ఈ సమావేశాల ఉద్దేశమన్నారు. ఇక్కడికి వచ్చిన ప్రతినిధులు తిరిగి తమ దేశాలకు వెళ్లిన తర్వాత తెలంగాణకు ప్రచారకర్తలుగా నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.బీజేపీని వ్యతిరేకిస్తే దేశాన్ని వ్యతిరేకించినట్లు కాదని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే వారిపై దేశద్రోహులనే ముద్ర వేయడం సరైంది కాదన్నారు. భారత్ సమ్మిట్ దేశ వ్యతిరేక సమావేశమంటూ బీజేపీ, బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలను ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ప్రయోజనాల కోసం తీసుకునే ప్రతి నిర్ణయాన్నీ గుడ్డిగా వ్యతిరేకించడం తగదని హితవు పలికారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు చర్చలే మార్గమని పేర్కొన్నారు.డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు సీఎం వెల్లడించారు. ఇప్పటికే ఢిల్లీ, బెంగళూరు, చెన్నైలో సన్నాహక కార్యక్రమాలు నిర్వహించామని, త్వరలో ముంబయి, అహ్మదాబాద్‌లోనూ చేపట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మూడు ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేర్చడం, యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని వివరించారు.రాష్ట్రంలో గిగ్ వర్కర్ల విధానాన్ని శనివారం నుంచి అమలు చేయనున్నట్లు రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ విధానాన్ని ప్రవేశపెట్టేందుకు కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ హైదరాబాద్‌కు వస్తున్నారని తెలిపారు. ఆయన రాకను బీజేపీ, బీఆర్ఎస్ నేతలు విమర్శించడాన్ని తప్పుబట్టారు. రాహుల్‌గాంధీ భారత్ సమ్మిట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొంటే అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు.సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్ మాట్లాడుతూ భారత్ సమ్మిట్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ప్రపంచ దేశాల మధ్య సహకారం, శాంతి, వాతావరణ మార్పులపై ఉమ్మడి కార్యాచరణ అవసరమని అభిప్రాయపడ్డారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామి, మహ్మద్ అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ప్రగతిశీల నేతల వేదికగా హైదరాబాద్

(మొదటి పేజీ తరువాయి)

ప్రతినిధులు హాజరయ్యారు. వివిధ దేశాల రాజకీయ నాయకులు, మంత్రులు, మాజీ మంత్రులు, పార్లమెంటు సభ్యులు, మేధావులు, విధాన రూపకర్తలు ఈ సమావేశాల్లో పాల్గొంటున్నారు.'ఫోర్జింగ్ ఏ న్యూ వరల్డ్' (నూతన ప్రపంచ నిర్మాణం) ఇతివృత్తంతో నిర్వహిస్తున్న ఈ సదస్సులో ప్రపంచం ఎదుర్కొంటున్న కీలక సమస్యలపై చర్చలు జరగనున్నాయి. కృత్రిమ మేధ, వాతావరణ మార్పులు, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ, యువత రాజకీయ భాగస్వామ్యం, మహిళా సాధికారత, లింగ సమానత్వం, మీడియా భవిష్యత్తు, అంతర్జాతీయ సంస్థల సంస్కరణలు ప్రధాన చర్చనీయాంశాలుగా ఉన్నాయి. ప్రపంచ దేశాల మధ్య సహకారం, శాంతి, ప్రజాస్వామ్య పరిరక్షణకు అవసరమైన ప్రత్యామ్నాయ విధానాల రూపకల్పనపై ప్రతినిధులు అభిప్రాయాలు పంచుకోనున్నారు. **తెలంగాణ అభివృద్ధిపై ప్రత్యేక చర్చలు** సదస్సులో భాగంగా తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన తొమ్మిది ప్రత్యేక చర్చాగోష్ఠులు నిర్వహిస్తున్నారు. ఫ్యూచర్ సిటీ, పట్టణీకరణ, ఆర్థిక న్యాయం, సామాజిక న్యాయం, సంక్షేమ విధానాలు, సహకార సమాఖ్యవాదం, సంస్కృతి, యువత, క్రీడలు, రాజకీయాలు, ఎన్నికల సమగ్రత వంటి అంశాలపై చర్చలు జరగనున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, ఇతర మంత్రులు ఈ సమావేశాల్లో పాల్గొంటున్నారు.**నేడు రాహుల్‌గాంధీ ప్రసంగం** శనివారం జరిగే ముగింపు సమావేశంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ప్రసంగించనున్నారు. భారత్ భవిష్యత్తు, ప్రపంచ రాజకీయ పరిణామాలు, విదేశాంగ విధానం, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి, శాంతియుత సహజీవనం, ప్రజాస్వామ్య విలువలపై తన అభిప్రాయాలను వెల్లడించనున్నారు. సదస్సు ద్వారా హైదరాబాద్‌కు అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభిస్తుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

భావితరాల భవిష్యత్తు కోసమే భారత్ ఫ్యూచర్ సిటీ

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ఆర్థిక ప్రగతికి చోదకశక్తులుగా నిలిచాయని, మారుతున్న ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నాలుగో నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేర్చాలనే లక్ష్య సాధనలో ఈ నగరం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. కేవలం పారిశ్రామిక ప్రాంతంగా కాకుండా ప్రజలు నివసించేందుకు, పనిచేసేందుకు, చదువుకునేందుకు, పరిశోధనలు చేసేందుకు, నూతన ఆవిష్కరణలకు కేంద్రంగా దీన్ని తీర్చిదిద్దుతామని వివరించారు.వర్షపు నీటి సంరక్షణ, నీటి పునర్వినియోగం, సౌర విద్యుత్, పచ్చదనం, సమర్థవంతమైన వ్యర్థాల నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు.

కృత్రిమ మేధ, లైఫ్ సైన్సెస్, వైద్య ఆరోగ్యం, ఎలక్ట్రానిక్స్, విద్యుత్ వాహనాలు, డేటా కేంద్రాలు, అంతరిక్ష సాంకేతికత, అధునాతన తయారీ రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాల నేపథ్యంలో అమెజాన్, హైపర్‌వాల్ట్, కంట్రోల్ఎస్, మారుబెనీ, సెమ్‌కార్ప్, ఎన్‌టిటి వంటి ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్నాయని వెల్లడించారు.భారత్ ఫ్యూచర్ సిటీని దేశ పారిశ్రామిక, పట్టణాభివృద్ధికి కొత్త నమూనాగా తీర్చిదిద్దుతామని శ్రీధర్‌బాబు అన్నారు. ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని ఆహ్వానించారు.

భూ కేటాయింపుల నుంచి పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, అనుమతుల వరకు అన్ని దశల్లోనూ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. చర్చాగోష్ఠిలో రాజీవ్ గాంధీ ఫౌండేషన్ సీఈవో విజయ్ మహాజన్, పట్టణాభివృద్ధి నిపుణుడు టికేందర్ సింగ్ పవార్, షేక్ సలావుద్దీన్, చరిత్రకారుడు సజ్జద్ షాహిద్, మాజీ ఎంపీ దివ్య స్పందన తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో రాజకీయ సమరానికి కవిత సన్నద్ధం!

సిద్దిపేట,నవంబర్ 13 (పీసీడబ్ల్యూ న్యూస్): సిద్దిపేట ప్రజలకు రాజకీయ స్వాతంత్ర్యం తీసుకొస్తామని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. హరీశ్‌రావు అవినీతికి పాల్పడ్డారని ఆరోపిస్తూ, ఆయనను ప్రజాజీవితం నుంచి తప్పించే వరకు పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు. శుక్రవారం సిద్దిపేటలో తెలంగాణ రక్షణ సేన కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ చేసిన అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.సిద్దిపేట తన సొంత గడ్డని, తెలంగాణ ఉద్యమానికి ఈ ప్రాంతం ఎంతో సహకరించిందని కవిత గుర్తుచేశారు. సామాజిక న్యాయ తెలంగాణ సాధన కోసం తాను చేస్తున్న పోరాటానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. సిద్దిపేటలో మున్సిపల్ ఎన్నికల నుంచే తమ రాజకీయ పోరాటం ప్రారంభమవుతుందని, అక్కడ తమ పార్టీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి మెదక్ జిల్లాకు రావాల్సిన నీరు అందడం లేదని విమర్శించారు. సుమారు రూ.93 వేల కోట్లు ఖర్చు చేసినా ఆశించిన స్థాయిలో సాగునీరు అందలేదని ఆరోపించారు. మల్లన్నసాగర్, కొండ పోచమ్మ సాగర్ నిర్వాసితులకు సరైన పరిహారం ఇవ్వలేదని, రంగనాయకసాగర్ వద్ద భూములకు పరిహారం తీసుకుని హరీశ్‌రావు గెస్ట్‌హౌస్ నిర్మించుకున్నారని ఆరోపించారు.మల్లన్నసాగర్ రిజర్వాయర్ భద్రతపై ఎన్‌జీఆర్ఐ గతంలోనే నివేదిక ఇచ్చిందని, అయినా తగిన జాగ్రత్తలు తీసుకోలేదని కవిత అన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్ బండ్ వద్ద లీకేజీలు వస్తున్నాయని, వాటిని కప్పిపుచ్చేందుకు బ్లాస్టింగ్ పేరుతో నాటకాలు ఆడుతున్నారని విమర్శిం చారు. ఈ అంశంపై ఈ నెల 19న సిద్దిపేటకు రానున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.హరీశ్‌రావు ఆరోగ్య మంత్రిగా ఉన్న సమయంలో నిమ్స్‌లో రూ.100 కోట్ల కుంభకోణం జరిగిందని, రూ.25 కోట్ల ఈపీఎఫ్ నిధులను ఇతర ఖాతాలకు మళ్లించారని కవిత ఆరోపించారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపించాలని ముఖ్యమంత్రిని కోరారు. సిద్దిపేటలో రైస్‌మిల్లుల సంఖ్య తగ్గిపోవడం, స్థానిక వ్యాపారాలు దెబ్బతినడం, గండిపల్లి రిజర్వాయర్ నిర్మాణం పెండింగ్‌లో ఉండటంపై కూడా ఆమె విమర్శలు చేశారు. తాము అధికారంలోకి వస్తే పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని తెలిపారు.

నీటి లభ్యత ఆధారంగా యాసంగి పంటల ఎంపిక

(మొదటి పేజీ తరువాయి)

విస్తృతంగా ప్రోత్సహించాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను గరిష్టంగా వినియోగించుకుని సాగు విస్తీర్ణం, దిగుబడులు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నీటి పొదుపు కోసం సూక్ష్మ సేద్యం, ముఖ్యంగా బిందు సేద్యం విధానాన్ని విస్తరించాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లకు స్పష్టం చేశారు.భూసేకరణ సమస్యలను గుర్తించి పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రభుత్వ పాఠశాలలను తరచూ సందర్శించి విద్యా కార్యక్రమాలు, విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, బోధనా ప్రమాణాలను పరిశీలించాలని ఆదేశించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణాలను వేగవంతం చేసి నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా భరోసా

- ఈ నెల 19న సిద్దిపేటలో పథకం ప్రారంభం
- 20 నుంచి 30 వరకు గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ
- ఇందిరమ్మ చీరల పంపిణీకి అదే రోజు శ్రీకారం

హైదరాబాద్, నవంబర్ 13 (పీసీడబ్ల్యూ న్యూస్): రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ఈ నెల 19న ప్రారంభించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా సిద్దిపేటలో నిర్వహించే భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. అదే వేదికగా ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించనున్నారు.ముఖ్యమంత్రి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. పథకానికి సంబంధించిన దరఖాస్తులను నవంబర్ 20 నుంచి 30 వరకు రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో సేకరించనున్నారు. ఇందిరమ్మ కమిటీలు ఇంటింటికీ వెళ్లి ప్రతి కుటుంబం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తాయి. అనంతరం వాటిని తహసీల్దార్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అందజేస్తారు.

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించడమే ఈ పథకం ఉద్దేశమని ప్రభుత్వం తెలిపింది. కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు ఈ పథకం దోహదపడుతుందని పేర్కొంది.ఇదిలా ఉండగా, రాష్ట్రవ్యాప్తంగా పూర్తయిన 2.25 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. మంత్రులు, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లోని లబ్ధిదారులతో కలిసి వేడుకల్లో పాల్గొననున్నారు.

ఎంఒయులు ఆచరణలోకి రావాలి

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన సీఐఐ పెట్టుబడుల భాగస్వామ్య సదస్సు శుక్రవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ 2024 జూన్ నుంచి ఆంధ్రప్రదేశ్ రూ.32 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం విశేషమన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఎదురైన ఇబ్బందులను అధిగమిస్తూ ఏపీ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. పోర్టులు, విమానాశ్రయాలు, ఎలక్ట్రానిక్స్, అంతరిక్ష, రక్షణ, పర్యాటక రంగాల్లో పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పాలన, పౌర సేవల్లో కృత్రిమ మేధ వినియోగాన్ని అభినందించారు.**ప్రభుత్వంపై పారిశ్రామికవేత్తలకు విశ్వాసం**సీఐఐ భాగస్వామ్య సదస్సు విజయవంతం కావడం ప్రభుత్వంపై పారిశ్రామికవేత్తలకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. వివిధ దేశాల నుంచి ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారని తెలిపారు.**రూ.32 లక్షల కోట్ల పెట్టుబడులు ఆచరణ దిశగా**ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పునరుద్ధరించామని, భోగాపురం విమానాశ్రయం, రైల్వే జోన్ వంటి కీలక ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు పెట్టుబడులు, పరిశ్రమలు తీసుకురావడమే లక్ష్యమన్నారు. 2024 నుంచి వచ్చిన 714 ఎంఒయూల ప్రతిపాదనల్లో 522 ఆచరణ దిశగా ఉన్నాయని వెల్లడించారు. కియా సంస్థ అదనంగా రెండు లక్షల కార్ల తయారీ కోసం రూ.18,878 కోట్ల పెట్టుబడికి ముందుకొచ్చిందని, రిలయన్స్ రూ.2.43 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందం చేసుకుందని తెలిపారు.**రెండో రోజు 12 ఒప్పందాలు**సదస్సు రెండో రోజైన శుక్రవారం వివిధ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో 12 ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. వీటి ద్వారా రూ.1,41,585 కోట్ల పెట్టుబడులు, 10,919 మందికి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. జిందాల్ గ్రూప్ కందుకూరులో రూ.15 వేల కోట్లతో మైనింగ్ కార్యకలాపాలు చేపట్టనుంది. అగ్నికుల్ కాస్మోస్ తిరుపతిలో డేటా కేంద్రం, రాకెట్ తయారీ కేంద్రం ఏర్పాటు చేయనుంది. గ్రీన్ జెన్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకున్నాయి. డిక్సన్ టెక్నాలజీస్, ఎయిర్‌ట్రంక్-జేసీకే ఇన్‌ఫ్రా, కాకినాడ సీపోర్ట్స్ తదితర సంస్థలు కూడా వివిధ ప్రాజెక్టులకు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి.ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, కె. రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్, సీఐఐ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

రూ.3 లక్షల కోట్లతో ఏపీలో రహదారుల అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

నిర్మిస్తున్న బెంగళూరుకడపవిజయవాడ గ్రీన్‌ఫీల్డ్ కారిడార్‌ను 2027 డిసెంబరు నాటికి అందుబాటులోకి తెస్తామని తెలిపారు. రూ.16 వేల కోట్లతో చేపట్టిన రాయ్‌పూర్‌విశాఖపట్నం కారిడార్ 2027 నాటికి పూర్తవుతుందని పేర్కొన్నారు.

దీంతో ప్రయాణ సమయం 13 గంటల నుంచి ఐదు గంటలకు తగ్గుతుందన్నారు. హైదరాబాద్‌విజయవాడ మచిలీపట్నం జాతీయ రహదారి ని రూ.12 వేల కోట్లతో ఆరు వరుసలుగా విస్తరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని వెల్లడించా రు. ఖరగ్‌పూర్‌విశాఖపట్నం అమరావతి కారిడార్‌కు రూ.71 వేల కోట్లు, అమరావతి చుట్టూ 190 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి రూ.32 వేల కోట్లతో ప్రతిపాదనలు రూపొందించినట్లు వివరించారు.

ఘనంగా జాతీయ క్రీడా పురస్కారాల ప్రదానం

(మొదటి పేజీ తరువాయి)

మహిళల ప్రపంచకప్ విజేత దివ్య దేశ్‌ముఖ్ అర్జున అవార్డులు అందుకున్న వారిలో ఉన్నారు. వీరితో పాటు అథ్లెట్ మహమ్మద్ అజ్మల్, బాక్సర్ నరేందర్, చెస్ క్రీడాకారుడు విదిత్ గుజరాతి, హాకీ క్రీడాకారులు లాల్రెమ్సియామి, రాజ్‌కుమార్ పాల్ పురస్కారాలు అందుకున్నారు.

సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు యెషయా అరుమైనియాగంకు అర్జున అవార్డు (జీవితకాల సాఫల్యం) ప్రదానం చేశారు. అథ్లెటిక్స్ కోచ్ పర్వీర్ సింగ్, బాక్సింగ్ కోచ్‌లు ఛోటే లాల్ యాదవ్, ధర్మేంద్ర సింగ్ యాదవ్, షూటింగ్ కోచ్ నేహా నందకుమార్ చవాన్, రెజ్లింగ్ కోచ్ వీరేంద్ర కుమార్‌లకు ద్రోణాచార్య అవార్డులు అందజేశారు. టెన్జింగ్ నార్గే జాతీయ సాహస పురస్కారం, పుణెలోని ఆర్మీ పారాలింపిక్ నోడ్‌కు రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కారం ప్రదానం చేశారు.ఈ ఏడాది ఆగస్టు 18న అవార్డు గ్రహీతల తుది జాబితాను ప్రకటించగా, వాయిదా పడిన పురస్కారాల ప్రదానోత్సవం తాజాగా నిర్వహించారు.

మోదీతో బహిరంగ చర్చకు రాహుల్ సవాల్

(మొదటి పేజీ తరువాయి)

తనతో ముఖాముఖి బహిరంగ చర్చకు రావాలని రాహుల్ మరోసారి సవాల్ విసిరారు. విదేశీ శక్తుల నియంత్రణలో ఎవరు ఉన్నారు? దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నది ఎవరు? అనే విషయాలు చర్చలో తేలుతాయని అన్నారు. ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధమని, ప్రధాని తనకు నచ్చిన వేదికను, న్యాయనిర్ణేతను ఎంపిక చేసుకోవచ్చని సూచించారు. టెలిప్రాంప్టర్ సహాయంతోనైనా చర్చకు రావచ్చని వ్యాఖ్యానించారు.పార్లమెంట్‌లో తనకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని, పలు కీలక అంశాలపై మాట్లాడుతున్న సమయంలో మైక్ నిలిపివేస్తున్నారని రాహుల్ విమర్శించారు. అందుకే ప్రజల సమక్షంలో నేరుగా చర్చ జరగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. తనతో చర్చకు వస్తే ప్రధాని రాజకీయ భవిష్యత్తు ముగుస్తుందని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలను బీజేపీ నేతలు ఖండించారు. కేరళ బీజేపీ అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ ఈ వ్యాఖ్యలను ఎద్దేవా చేశారు. రాహుల్ ఫోన్‌ను ట్యాప్ చేయాల్సిన ఆసక్తి ఎవరికీ లేదని వ్యాఖ్యానించారు. అయితే, తన ఫోన్ ట్యాపింగ్ అవుతోందన్న ఆరోపణలకు రాహుల్ ఈ సందర్భంగా ఎలాంటి సాంకేతిక ఆధారాలను బహిరంగంగా వెల్లడించలేదు.ం

నగర భద్రతకు పెద్దపీట..

కొత్త సీపీ మహేష్ భగవత్

- శాంతిభద్రతలు, మహిళా రక్షణ, ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి
- నేరస్తులపై కఠిన చర్యలు.. అక్రమ వసూళ్లకు పాల్పడితే కేసులు



హైదరాబాద్, నవంబర్ 13 (పీసీడబ్ల్యూ న్యూస్): హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు, మహిళల భద్రతకు, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని నూతన పోలీస్ కమిషనర్ మహేష్ భగవత్ తెలిపారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో మాజీ సీపీ సజ్జనార్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నగరంలో సివిల్ వివాదాల్లో పోలీసులు జోక్యం చేసుకోకుండా చర్యలు తీసుకుంటామని మహేష్ భగవత్ స్పష్టం చేశారు. భూముల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో భూ తగాదాలకు సంబంధించి దాడులు జరుగుతున్నాయని, ఇలాంటి ఘటనలపై కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. అనుభవజ్ఞులైన అధికారులతో కలిసి సమష్టిగా పనిచేస్తానన్నారు.తరచూ నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. పాత నేరస్తులపై నిరంతరం నిఘా ఉంచుతామని తెలిపారు. పోలీసులు ఎవరైనా అక్రమ వసూళ్లకు పాల్పడితే క్రిమినల్ కేసులతో పాటు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కాకతీయ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్వ్యూ

నైపుణ్యాలపై శిక్షణ కార్యక్రమం..

హనుమకొండ, నవంబర్ 13 (పీసీడబ్ల్యూ న్యూస్): కాకతీయ ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి), హనుమకొండలోని టీఎన్‌కేసీ, ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో టాస్క్ సహకారంతో విద్యార్థుల కోసం “ఇంటర్వ్యూ నైపుణ్యాలు” అనే అంశంపై ఒకరోజు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాన్ని కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో ఉద్యోగాలు సాధించడానికి విద్యార్హతలతో పాటు కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, సానుకూల దృక్పథం, వృత్తిపరమైన ప్రవర్తన ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టాస్క్ సాఫ్ట్‌స్కిల్స్ ట్రైనర్ కె. శ్రీనివాస్ విద్యార్థులకు శిక్షణ అందించారు. స్వీయ పరిచయం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, బాడీ లాంగ్వేజ్, హెచ్‌ఆర్, టెక్నికల్ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం, ఇంటర్వ్యూను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవడం





వంటి అంశాలపై ప్రాయోగిక అవగాహన కల్పించారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్, టీఎన్‌కేసీ కోఆర్డినేటర్ డా. ఎ. అనిల్‌కుమార్ కార్యక్రమాన్ని సమన్వయం చేస్తూ, క్యాంపస్ ప్లేస్‌మెంట్లు, బహుళజాతి సంస్థల ఉద్యోగ నియామకాలు, పోటీ పరీక్షల ఇంటర్వ్యూలు, ఇంటర్న్‌షిప్‌లు, ఉన్నత విద్య ప్రవేశాల్లో ఇంటర్వ్యూ నైపుణ్యాల ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు అకడమిక్ పరిజ్ఞానంతో పాటు కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజశేఖర్, ప్రొఫెసర్ శ్రీనాథ్, డా. శ్రీకాంత్, డా. డి. వెంకన్న, డా. జి.కె. కుమార్, పి. సాగర్, బాలు, వినయ్, వందన, మాధవ్, సునీత, జ్యోతి తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఇంటర్వ్యూ విధానాలు, ఉద్యోగ సాధనకు అవసరమైన నైపుణ్యాలు, కెరీర్ అభివృద్ధిపై విలువైన అవగాహన లభించింది.

ఫాదర్ తాటికొండ జోసెఫ్‌కు

డాక్టరేట్ ప్రదానం

- ఆంగ్ల సాహిత్యంలో పీహెచ్‌డీ పట్టా అందుకున్న డయాసిస్ పాస్టరల్ సెంటర్ డైరెక్టర్
- అమితావ్ ఘోష్ నవలలపై పరిశోధనకు ఫాదర్ జోసెఫ్‌కు డాక్టరేట్



వరంగల్, నవంబర్ 13(పిసిడబ్ల్యూ న్యూస్): వరంగల్ డయాసిస్ పాస్టరల్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ తాటికొండ జోసెఫ్ ఆంగ్ల సాహిత్యంలో డాక్టరేట్ (పీహెచ్‌డీ) పట్టాను అందుకున్నారు. మధ్యప్రదేశ్‌లోని పీకే యూనివర్సిటీ ఆయనకు ఈ గౌరవాన్ని ప్రదానం చేసింది. ప్రముఖ రచయిత అమితావ్ ఘోష్ నవలలపై ఆయన రూపొందించిన “హిస్టోరిసిజం అండ్ మ్యాజికల్ రియలిజం ఇన్ సెలెక్ట్ నావెల్స్ ఆఫ్ అమితావ్ ఘోష్” అనే పరిశోధనాత్మక సిద్ధాంత వ్యాసాన్ని విశ్వవిద్యాలయం ఆమోదించి డాక్టరేట్‌ను ప్రకటించింది. ఈ మేరకు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ జితేందర్ కుమార్ మాలిక్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. 20222023 విద్యా సంవత్సరంలో పరిశోధనకు నమోదు చేసుకున్న ఫాదర్ జోసెఫ్, గైడ్ డాక్టర్ కవిత అగ్నిహోత్రి పర్యవేక్షణలో తన పరిశోధనను విజయవంతంగా పూర్తి చేశారు. **21 ఏళ్ల ఆధ్యాత్మిక, విద్యా సేవలు:** స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన ఫాదర్ తాటికొండ జోసెఫ్ 2005లో వరంగల్ కతోలిక పీఠానికి గురువుగా అభిషిక్తులయ్యారు. గత 21 సంవత్సరాలుగా డయాసిస్ పరిధిలో ఆధ్యాత్మిక, సామాజిక మరియు విద్యా రంగాల్లో విశేష సేవలందిస్తున్నారు. ప్రస్తుతం వరంగల్ ఫాతిమా నగర్‌లోని డయాసిసన్ పాస్టరల్ సెంటర్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. డాక్టరేట్ సాధించిన ఫాదర్ జోసెఫ్‌ను వరంగల్ పీఠాధిపతి, గురువులు మరియు విశ్వాసులు ప్రత్యేకంగా అభినందించారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని విద్యా, ఆధ్యాత్మిక సేవలు అందించాలని ఆకాంక్షించారు.

ఘనంగా ప్రజాకవి కాళోజీ వర్ధంతి

తెలంగాణ సాంస్కృతిక సారథి ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రజాకవి కాళోజీ 24వ వర్ధంతి

కల్లూరు, నవంబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్) : ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు 24వ వర్ధంతిని పురస్కరించుకుని ఈరోజు ఖమ్మంలోని అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ సాంస్కృతిక సారథి ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు పాగి వెంకన్న ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి, పూలతో ఘనంగా అంజలి ఘటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ సామాజిక ఉద్యమకారుడు నందిగామ రాజ్ కుమార్ జానీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు సాహితీ సేవలను, ఉద్యమ



స్ఫూర్తిని స్మరించుకున్నారు.ప్రజల భాషలో కవిత్వం పుట్టుక నీది, చావు నీది, బతుకంతా దేశానిది అంటూ తన జీవితాన్ని ప్రజలకు అంకితం చేసిన మహనీయుడు కాళోజీ అని కొనియాడారు. పండితుల భాషకు పరిమితమైన కవిత్వాన్ని సామాన్యుడి వాడుక భాషలోకి తీసుకొచ్చి, ప్రజల కష్టసుఖాలకు అక్షర రూపం ఇచ్చారని గుర్తు చేసుకున్నారు. ఉద్యమాల ఊపిరి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన విమోచన పోరాటం నుండి ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వరకు ఆయన తన కలం, గళంతో ప్రజలను చైతన్యపరిచారని తెలిపారు. అన్యాయం ఎక్కడ జరిగితే అక్కడ తన గొంతుకను వినిపించిన నికార్సయిన ప్రజాకవి కాళోజీ అని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వి5 న్యూస్ చానెల్ కేవీ, సామాజిక ఉద్యమకారులు దేవిరెడ్డి విజయ్, గుంతేటి వీరభద్రం, జానపద రాష్ట్ర కార్యదర్శి పమ్మి రవి, దాసరి శ్రీనివాస్, నరేందర్, అడ్వకేట్ కోలాటం శ్రీకాంత్, సాంస్కృతిక సారథి మిమిక్రీ భద్ర, మేడ ముత్తయ్య, ఎర్ర గంగాధర్ మెట్టు వెంకటేశ్వర్లు తదితర ఉద్యమకారులు, కళాకారులు ప్రజా సంఘాల వారు పాల్గొన్నారు.

కులం కోసం సేవకుడిగా పనిచేస్తా: కొండ దేవయ్య పటేల్



హైదరాబాద్, నవంబర్ 13(పిసిడబ్ల్యూ న్యూస్): పదవులు ముఖ్యం కాదని, ప్రాణం ఉన్నంతవరకు కులం కోసం సేవకుడిగా పనిచేస్తానని తెలంగాణ మున్నూరు కాపు సంఘం (పటేల్స్) వ్యవస్థాపక అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్ పేర్కొన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్వీ మహేందర్ కుమార్ అధ్యక్షతన రాష్ట్ర ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టి. రాజ్‌కుమార్ తో కలిసి డాక్టర్ కొండా దేవయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ‘ఒకే కులం ఒకే సంఘం’ నినాదంతో అందరూ ఏకమై సంఘాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. నూతన రాష్ట్ర కార్యవర్గ ఎన్నికను పారదర్శకంగా నిర్వహించేందుకు 9 మంది సభ్యులతో ఎన్నికల కమిటీ, 33 జిల్లాలకు సమన్వయకర్తలను నియమించాలని సమావేశంలో నిర్ణయించారు. 18 ఏళ్లు నిండిన అర్హులందరికీ సభ్యత్వం కల్పించి ఓటర్ల జాబితా తయారు చేస్తామని, త్వరలోనే పూర్తి ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ నరసింహారెడ్డి, నగర యువజన విభాగం అధ్యక్షులు ఎర్ర విశాల్ పటేల్, ఉపాధ్యక్షులు తోట శ్రవణ్, ప్రొఫెసర్ పి. లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, బూడిద రాజేందర్, గుజ్జు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జాగృతి కళాశాలలో ఘనంగా ‘ఫ్రెషర్స్ డే’ వేడుకలు

సాంకేతికతను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ఓయూ బిజినెస్ మేనేజ్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ వై. జహంగీర్

హైదరాబాద్, నవంబర్ 13(పిసిడబ్ల్యూ న్యూస్): స్థానిక జాగృతి డిగ్రీ కళాశాలలో ‘ఫ్రెషర్స్ డే‘ వేడుకలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉస్మానియా యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ వై. జహంగీర్ మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను విద్యార్థులు ఎప్పటికప్పుడు గమనిస్తూ, నూతన సాంకేతికతను తమ భవిష్యత్తు అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. “మానవ జన్మ విశ్రమించడానికి కాదు.. నిరంతరం శ్రమించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి“ అని ఆయన ఉద్బోధించారు. నేటి పోటీ ప్రపంచంలో కామర్స్, మేనేజ్‌మెంట్, సైన్స్ కోర్సులకు విశేష ఆదరణ ఉందని, విద్యార్థులు కష్టపడి చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకుంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు కొదవ ఉండదని స్పష్టం చేశారు.కళాశాల చైర్మన్ డాక్టర్ ఓ. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. తమ





విద్యాసంస్థ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, వారి సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. సెక్రటరీ శశికిరణ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి కోసం కళాశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. త్వరలోనే పలు బహుళజాతి సంస్థలు క్యాంపస్ ప్లేస్‌మెంట్ల కోసం కళాశాలకు రానున్నాయని వెల్లడించారు.ప్రిన్సిపాల్ జోసెఫిన్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరవుతూ, రాబోయే పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కళాశాల ఉత్తీర్ణత శాతాన్ని మరింత పెంచాలని ఆకాంక్షించారు. వైస్ ప్రిన్సిపాల్ మధుసూదన్ మాట్లాడుతూ.. విద్యా, వాణిజ్య రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా పారిశ్రామిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని, రోజూ సిలబస్‌ను చదవడం ద్వారా అన్ని సబ్జెక్టుల్లో సులభంగా ఉత్తీర్ణత సాధించవచ్చని తెలిపారు. బీఎస్సీ ఇన్‌ఛార్జ్ సంతోష్ రెడ్డి మాట్లాడుతూ.. క్రమశిక్షణతో మెలగడం ద్వారా ఎన్నో కొత్త విషయాలు నేర్చుకుని, ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా విద్యార్థులు నిర్వహించిన ‘ర్యాంప్ వాక్‘ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకురాలు రెబెకా యాస్మీన్, అధ్యాపక బృందం, అడ్మిన్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నవంబర్ 15 నుంచి డంపింగ్ యార్డు ఎత్తివేతకు రిలే నిరసన దీక్షలు

- దీక్షలకు మద్దతు కోరుతూ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మహేందర్ రెడ్డికి వినతిపత్రాలు
- జేఏసీ కో-కన్వీనర్‌గా బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్ రెడ్డి





జవహర్ నగర్ నవంబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్): జవహర్ నగర్ డంపింగ్ యార్డును శాశ్వతంగా తొలగించాలని డిమాండ్ చేస్తూ, నవంబర్ 15 నుంచి జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి తెలిపారు. ఈ దీక్షలకు మద్దతు కోరుతూ శుక్రవారం మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఆయన తనయుడు మహేందర్ రెడ్డికి వినతిపత్రాలు అందజేసినట్లు వెల్లడించారు. డంపింగ్ యార్డు కారణంగా పరిసర ప్రాంతాల్లో దుర్వాసన, భూగర్భ జలాల కాలుష్యం, అనారోగ్య సమస్యలు, పర్యావరణ నష్టం తీవ్రంగా పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి ప్రజలు ఆందోళనలు, విజ్ఞప్తులు చేస్తున్నా ప్రభుత్వాలు శాశ్వత పరిష్కారం చూపడం లేదని విమర్శించారు. శాసనసభలో ఈ సమస్యను లేవనెత్తి, యార్డు తొలగింపునకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఎమ్మెల్యేను కోరినట్లు తెలిపారు.త్వరలో ఎంపీ ఈటల రాజేందర్, కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్‌లను కలిసి దీక్షలకు మద్దతు కోరనున్నట్లు చెప్పారు. బాధిత ప్రాంతాల ప్రజలు, వివిధ ప్రజాసంఘాలు ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం కోసం అవసరమైతే పదవికి రాజీనామా చేసి ఉద్యమానికి అండగా నిలుస్తానని ఎమ్మెల్యే మల్లారెడ్డి హామీ ఇచ్చినట్లు షావలి తెలిపారు. జేఏసీ కో-కన్వీనర్‌గా బాధ్యతలు స్వీకరించేందుకు అంగీకరించిన బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జేఏసీ కోశాధికారి, ఐఎఫ్‌టీయూ నాయకుడు శివబాబు, కో-కన్వీనర్లు ఆలూరి రాజశేఖర్, పల్లపు రవి, వి. ప్రవీణ్, డి. జాన్, వై. మల్లేష్, జయ తదితరులు పాల్గొన్నారు.

జిజ్ఞాస స్టడీ ప్రాజెక్టులో కరీంనగర్ మహిళా కళాశాల విద్యార్థుల సత్తా..

- రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి..

కరీంనగర్ నవంబర్ 13(పిసిడబ్ల్యూ న్యూస్): డిగ్రీ స్థాయిలో నిర్వహించిన ‘జిజ్ఞాస‘ స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టులో కరీంనగర్ ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి సాధించి సత్తా చాటారు. కెమిస్ట్రీ, తెలుగు విభాగాల్లో విద్యార్థులు రూపొందించిన రెండు వేర్వేరు ప్రాజెక్టులకు ఈ ప్రతిష్టాత్మక బహుమతులు లభించాయి. కెమిస్ట్రీ విభాగం లో డాక్టర్ రావుల మొగిలి పర్యవేక్షణలో “ప్రిపరేషన్ అండ్ ఫిజికో కెమికల్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ ఎకో ఫ్రెండ్లీ బయో డిగ్రేడబుల్ పాలిమర్ డిరైవ్డ్ ఫ్రమ్ బనానా పీల్“ (అరటి తొక్కల నుండి పర్యావరణ అనుకూల బయో డిగ్రేడబుల్ పాలిమర్ తయారీ) అనే అంశంపై జారా ఫాతిమా, నవ్యశ్రీ, సిరి చందన, వందన, సమీక్ష బృందం ద్వితీయ బహుమతి గెలుచుకుంది. తెలుగు విభాగం లోకాజీపేట వెంకటరమణ పర్యవేక్షణలో “దాశరథి గీతాలు – ఉద్యమ స్ఫూర్తి“ అనే అంశంపై ఆశ్రిత, కృపామణి, హస్మిత, అర్చన,



రమ్య, కోమలత బృందం రాష్ట్రస్థాయి ద్వితీయ బహుమతిని కైవసం చేసుకుంది. విజేతలకు మేయర్ శ్రీనివాస్, ఎన్. ఆర్.ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ శ్రీనివాస్ మాట్లాడుతూడిగ్రీ స్థాయి నుంచే ఇలాంటి ప్రాజెక్టులు చేయడం వల్ల విద్యార్థుల్లో పరిశోధన పట్ల ఆసక్తి పెరుగుతుందని, భవిష్యత్తులో మరిన్ని పెద్ద పరిశోధనలు చేసేందుకు ఇవి దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ, పీజీ తర్వాత పీహెచ్‌డీలో చేసే పరిశోధనలపై డిగ్రీ స్థాయి నుంచే అవగాహన పెంచుకోవడానికి జిజ్ఞాస స్టడీ ప్రాజెక్టులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు.రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వారి గైడ్‌లను కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి , అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించారు.

తెలంగాణ అండర్-19 బాలికల క్రికెట్ జట్టుకు బండి సంజయ్ అండ

- ఢిల్లీ నుంచి జమ్ముకశ్మీర్‌కు 17 మంది క్రీడాకారిణులకు ప్రత్యేక ప్రయాణ ఏర్పాట్లు



కరీంనగర్ నవంబర్ 13(పిసిడబ్ల్యూ న్యూస్): జాతీయ స్థాయి అండర్-19 బాలికల క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లిన తెలంగాణ జట్టుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అండగా నిలిచారు. ఢిల్లీ నుంచి జమ్ముకశ్మీర్‌కు వెళ్లే సమయంలో ప్రయాణ ఇబ్బందులు ఎదుర్కొన్న 17 మంది క్రీడాకారిణులకు తక్షణమే ప్రత్యేక ప్రయాణ ఏర్పాట్లు చేయించారు.జాతీయ స్థాయి పోటీల కోసం తెలంగాణ నుంచి బయలుదేరిన బాలికల జట్టు ఢిల్లీ చేరుకున్న తర్వాత అనివార్య కారణాలతో జమ్ముకశ్మీర్‌కు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంది. దీంతో సమయానికి పోటీలకు చేరుకోలేమేమోనని క్రీడాకారిణులు ఆందోళన చెందారు. ఈ విషయాన్ని కరీంనగర్ బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు వేముల అనిల్ కుమార్ ద్వారా బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లారు.వెంటనే స్పందించిన కేంద్ర మంత్రి సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి 17 మంది క్రీడాకారిణులకు ప్రత్యేక ప్రయాణ సదుపాయాలు కల్పించారు. ఆయన చొరవతో జట్టు సురక్షితంగా జమ్ముకశ్మీర్‌కు చేరుకుంది.సమయంలో స్పందించి సహకరించిన బండి సంజయ్ కుమార్‌కు క్రీడాకారిణులు, కోచ్‌లు, వారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లిన వేముల అనిల్ కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలి

● ప్రైవేట్ వ్యాపారుల సిండికెట్ దోపిడీకి అడ్డుకట్ట వేయాలి ● మద్దతు ధరకే కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకోవాలి ● రైతు సంఘం రాష్ట్ర నాయకులు, సీపీఐ (ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్



ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :జిల్లా వ్యాప్తంగా వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, రైతుల నుంచి కనీస మద్దతు ధరకే కొనుగోళ్లు చేపట్టాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు, సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ప్రైవేట్ వ్యాపారులు, మిల్లర్లు సిండికేట్‌గా ఏర్పడి ధాన్యం ధరలను తగ్గిస్తూ రైతులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు.ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. రెండు రోజుల క్రితం క్వింటా ధాన్యం ధర రూ.3,500 ఉండగా, ప్రస్తుతం రూ.2,600కు పడిపోయిందని, రోజుకు సుమారు రూ.100 చొప్పున ధర తగ్గిస్తూ రైతులకు నష్టం కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సన్న రకం ధాన్యానికి క్వింటాకు రూ.2,481 మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ కలిపి చెల్లించాలని, ఈ బోనస్‌ను అన్ని రకాల ధాన్యానికి వర్తింపజేయాలని కోరారు.ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని, తక్కువ ధరకు కొనుగోలు చేసే వ్యాపారులు, మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. రైతులు కూడా మద్దతు ధర లేదా అంతకంటే ఎక్కువ చెల్లించే వారికే ధాన్యం విక్రయించాలని విజ్ఞప్తి చేశారు.

ఖమ్మంలో 'శుభప్రదమ్' ఎగ్జిబిషన్ సేల్ ప్రారంభం

- రూ.99 నుంచే బ్రాండెడ్ దుస్తులు.. పది రోజుల పాటు ప్రత్యేక విక్రయాలు

- ఎగ్జిబిషన్ సేల్ 'శుభప్రదమ్'ను ప్రారంభించిన జబర్దస్త్ ఫేమ్ నటి వర్ష, కాంగ్రెస్ రాష్ట్ర యువ నాయకులు తుమ్మల యుగేందర్

- ఖమ్మం ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- "శుభప్రదమ్" ఎగ్జిబిషన్ సేల్ యాజమాన్యం అల్లక జాన్ బాబు, అల్లక భవాని














ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్):ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీ వేధిక ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన 'శుభప్రదమ్' ఎగ్జిబిషన్ సేల్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. జబర్దస్త్ ఫేమ్ నటి వర్ష, కాంగ్రెస్ రాష్ట్ర యువ నాయకులు తుమ్మల యుగేందర్ ముఖ్య అతిథులుగా హాజరై ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షుడు నాగళ్ల దీపక్ చౌదరి జ్యోతి ప్రజ్వలన చేశారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటు ధరల్లో బ్రాండెడ్ దుస్తులను అందించడం అభినందనీయమన్నారు. కేవలం రూ.99 నుంచే దుస్తులు అందుబాటులో ఉంచడం ప్రత్యేకత అని, ఖమ్మం ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నటి వర్ష మాట్లాడుతూ కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ నచ్చే విధంగా వివిధ రకాల వస్త్రాలను ఒకే చోట అందుబాటులో ఉంచడం సంతోషకరమన్నారు. యువతతో ఆమె సరదాగా ముచ్చటించడం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఎగ్జిబిషన్‌లో మహిళల కోసం సప్తగిరి పట్టు, కంచిపట్టు, మంగళగిరి, ఉప్పాడ పట్టు చీరలతో పాటు వివిధ రకాల కాటన్ చీరలను ఏర్పాటు చేశారు. పురుషుల కోసం జీన్స్, ఫార్మల్ దుస్తులు, షర్ట్స్, టీషర్టులు, చిన్నారుల కోసం కిడ్స్ వేర్, యువతుల కోసం ఫ్యాషన్ దుస్తులు అందుబాటులో ఉంచారు. నిర్వాహకులు అల్లక జాన్ బాబు, అల్లక భవాని మాట్లాడుతూ ఖమ్మం ప్రజలకు నాణ్యమైన బ్రాండెడ్ దుస్తులను తక్కువ ధరలకు అందించాలనే ఉద్దేశంతో ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నవంబర్ 13 నుంచి 22వ తేదీ వరకు పది రోజుల పాటు ప్రత్యేక విక్రయాలు కొనసాగుతాయని వెల్లడించారు. జిల్లా ప్రజలు కుటుంబ సమేతంగా వచ్చి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు తుమ్మల యుగేందర్, నగర అధ్యక్షుడు నాగళ్ల దీపక్ చౌదరి, సిటీ కాంగ్రెస్ ఓబీసీ చైర్మన్ బాణాల లక్ష్మణ్, ఐఎన్‌టీయూసీ నగర అధ్యక్షుడు నరాల నరేష్, మోహన్ నాయుడు, షాపింగ్ మాల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదింటి జీవితాల్లో పింఛన్ వెలుగులు

- 34 నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా

- 48వ డివిజన్ సారథినగర్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లే సాయికిరణ్



ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్) : పేదరికంతో పోరాడుతూ నిత్యజీవిత అవసరాలను తీర్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు చిన్నపాటి ఆర్థిక సహాయం సైతం కొండంత అండగా నిలుస్తుంది. ముఖ్యంగా వృద్ధాప్యంలో, అనారోగ్య పరిస్థితుల్లో ఆసరా కోసం ఎదురుచూసే పేదలకు పింఛన్ ఒక ఆర్థిక భరోసా మాత్రమే కాదు.. ఆత్మగౌరవంతో జీవించేందుకు లభించే ధైర్యం కూడా, అలాంటి మానవీయ ఆలోచనతో ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని 48వ డివిజన్ సారథినగర్‌లో 34 మంది అర్హులకు నూతన పింఛన్లు మంజూరు చేయించి, లబ్ధిదారులకు అందించడం అభినందనీయంగా నిలిచింది. తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆశీస్సులతో, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో, కాంగ్రెస్ రాష్ట్ర యువ నాయకుడు తుమ్మల యుగంధర్ తోడ్పాటుతో ఈ పింఛన్లు మంజూరయ్యాయని 48వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లే సాయికిరణ్ అన్నారు. బోజ్జ సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు నూతన పింఛన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అల్లే సాయికిరణ్ మాట్లాడుతూ... అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడినవారికి అండగా నిలవడం, వారి జీవితాల్లో భరోసా నింపడం ప్రతి ప్రజాప్రతినిధి, ప్రజాసేవకుడి బాధ్యత అని అన్నారు. అర్హులైన పేదలను గుర్తించి వారికి పింఛన్లు మంజూరయ్యేలా కృషి చేయడం ఎంతో ఆత్మ సంతృప్తిని ఇస్తుందన్నారు.పదవులు, హోదాల కంటే ఆపదలో ఉన్నవారికి అందించే సహాయమే చిరకాలం గుర్తుండిపోతుంది. పింఛన్ కోసం ఎదురుచూస్తున్న 34 మంది పేద కుటుంబాలకు ఈ సహాయం కొంత ఊరటను, భవిష్యత్తుపై భరోసాను కల్పించింది. ప్రజల కష్టాలను గుర్తించి, అర్హులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేసే నాయకుల సేవలు సమాజంలో ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు.తోడబోయిన అరుణ, పిట్టల అనురాధ, యాకా లక్ష్మి, జహీర్, సారంగపాణి, దొంతగాని హరీష్, కొయ్య బాలాజీ, కొయ్య వెంకటేష్, జోగు పత్తి ఉపేందర్, వార శివ, గొడుగు మన్సూర్, మన్నె ఉపేందర్, అరుణ్, షంషుద్దీన్, శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పసి హృదయాల పాలిట పెద్ద మనసు చాటుకున్న శీనన్న!

● తలసేమియా బాధిత చిన్నారులకు చేయూత పింఛన్ల మంజూరు

● మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన బాధితులు



ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్) : తలసేమియా వ్యాధితో పోరాడుతున్న చిన్నారుల జీవితాల్లో ఆర్థిక భరోసా నింపేందుకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీసుకున్న చొరవపై బాధిత కుటుంబాలు హర్షం వ్యక్తం చేశాయి. చేయూత పథకం కింద పింఛన్లు మంజూరు చేయించడంతో తమకు ఎంతో ఊరట లభించిందని పేర్కొంటూ శుక్రవారం పలువురు తలసేమియా బాధితులు మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.గతంలో ఎంపీగా ఉన్నప్పుడే తలసేమియా బాధితుల సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించిన పొంగులేటి.. ప్రస్తుతం రాష్ట్ర మంత్రిగా కూడా వారి సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని గుర్తుచేశారు. ఆయన చొరవతో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ పరిధిలోని సుమారు 150 మంది చిన్నారులతో పాటు జిల్లాలోని వందలాది మంది బాధితులకు పింఛన్లు మంజూరు కానుండటం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. తమ కష్టాలను గుర్తించి ఆర్థికంగా అండగా నిలిచిన శీనన్నకు చిన్నారులు, వారి కుటుంబ సభ్యులు, సంస్థ ఉపాధ్యక్షురాలు పొద్దుటూరి పావని, సభ్యులు అనిత, ఉదయ భాస్కర్ తదితరులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

ముగిసిన ఎంజేపీ బాలికల ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి క్రీడా పోటీలు







● ముఖ్య అతిథిగా ఉమ్మడి వరంగల్ జిల్లా ఆర్‌సిఓ డాక్టర్ శ్రవణ్ కుమార్ ● విశిష్ట అతిథిగా కమలాపూర్ ఎంపీడీవో గుండె బాబు

కమలాపూర్ నవంబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్): హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో 11వ తేది బుధవారం ప్రారంభమైన మహాత్మా జ్యోతి బాఫూలే ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాలికల పాఠశాల కళాశాలల క్రీడా పోటీలు మూడు రోజులపాటు ఉత్సాహంగా పోటా పోటీగా సాగిన ఈ క్రీడలు శుక్రవారం రోజున ఘనంగా ముగిశాయి.ఈ జిల్లా స్థాయి క్రీడా పోటీల ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా ఎం జె పి వరంగల్ ఉమ్మడి జిల్లా ఆర్ సి ఓ డాక్టర్ శ్రవణ్ కుమార్ హాజరయ్యారు.ఈ క్రీడా పోటీల ముగింపు సమావేశానికి సభాధ్యక్షులు గా మనోహర్ రెడ్డి వ్యవహరించారు.ఈ సందర్భంగా సమావేశానికి విచ్చేసిన అతిథులు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు.క్రీడల్లో రాణించే వారికి క్రమశిక్షణతో పాటు మానసిక వికాసం కలిగి ఉంటారని తెలిపారు.జిల్లా స్థాయి క్రీడా పోటీల నిర్వహణకు, విద్యార్థులకు అవసరమైన వసతుల కల్పన కు రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని అన్నారు.ప్రభుత్వ సహకారంతో ప్రోత్సాహంతో బడుగు,బలహీన వర్గాల విద్యార్థిని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకుంటున్నారని, భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో క్రీడల్లో రాణించి జీవితంలో గొప్పగా ఎదగాలని ఆకాంక్షించారు.భవిష్యత్తులోను ఇదే స్ఫూర్తితో విద్యార్థిని ల వికాసానికి తోడ్పడే క్రీడా పోటీలను ఘనంగా నిర్వహిస్తామని అన్నారు.18 పాఠశాలల కళాశాలల విద్యార్థినిలు సుమారుగా1700 మంది పాల్గొన్నారు.అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి.వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.ఓవరాల్ ఛాంపియన్: అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నెక్కొండ పాఠశాల విద్యార్థినిలు ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో ఓవరాల్ ఛాంపియన్ గా నిలిచారు. వ్యక్తిగత విభాగంలోనూ నెక్కొండ పాఠశాలకు చెందిన అమ్ములు అనే విద్యార్థిని ఛాంపియన్ గా నిలిచి ప్రత్యేక ప్రశంసలు అందుకుంది.ఈ ఎం జె పి పాఠశాల కళాశాల క్రీడలనువిజయవంతంగా నిర్వహించిన సెక్రెటరీ సైదులు కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులు గా కమలాపూర్ ఎంపీడీవో గుండె బాబు , గూడూర్ గ్రామ సర్పంచ్ బండి వనజ కళాధర్,కమలాపూర్ గ్రామ సర్పంచ్ పబ్బు సతీష్ గౌడ్,వరంగల్ ఉమ్మడి జిల్లాల డి సి ఓ లు,కమలాపూర్ ఎం జె పి బాలికల ప్రిన్సిపల్ సౌజన్య, ఉమ్మడి వరంగల్ జిల్లాల పాఠశాలల కళాశాలల ప్రిన్సి పాల్స్,వ్యాయామ ఉపాధ్యాయులు,ఉపాధ్యాయ బృందం,విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వర్క్‌షాప్‌లు









- అకౌంటెంట్ జనరల్ నావల్ కిషోర్

- ఉమ్మడి జిల్లా పెన్షన్, జీపీఎఫ్ అదాలత్, వర్క్‌షాప్ లో పాల్గొన్న అకౌంటెంట్ జనరల్

ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :ఉద్యోగుల పెన్షన్, జీపీఎఫ్, ఇతర సర్వీస్ సంబంధిత సమస్యల సత్వర పరిష్కారానికి జిల్లాల వారీగా ప్రత్యేక వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నట్లు అకౌంటెంట్ జనరల్ వి.ఎం.వి. నావల్ కిషోర్ తెలిపారు. శుక్రవారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా పెన్షన్, జీపీఎఫ్ అదాలత్, వర్క్‌షాప్‌లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా నావల్ కిషోర్ మాట్లాడుతూ పెన్షన్ ఆమోదం, జీపీఎఫ్ దరఖాస్తులు, ఆర్థిక ఖాతాలకు సంబంధించిన ప్రక్రియల్లో ఖచ్చితత్వం అవసరమన్నారు. పదవీ విరమణకు ముందే ఉద్యోగుల దరఖాస్తులు సరైన వివరాలతో, నిర్ణీత సమయంలో సంబంధిత కార్యాలయాల ద్వారా అందించాలని సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వుల్లోని నిబంధనలపై వివిధ కార్యాలయాల్లో నెలకొనే భిన్నాభిప్రాయాలను నివృత్తి చేసి, స్పష్టమైన మార్గదర్శకాలు అందించడమే వర్క్‌షాప్‌ల ప్రధాన ఉద్దేశమన్నారు. ట్రెజరీల పనితీరును మెరుగుపరిచేందుకు తనిఖీలు, ఆడిట్ సూచనలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను గుర్తించి పరిష్కార మార్గాలు చూపుతామని పేర్కొన్నారు.అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సుదీర్ఘకాలం ప్రభుత్వ సేవలందించి పదవీ విరమణ పొందిన ఉద్యోగుల పట్ల గౌరవంగా వ్యవహరించాలని, వారి సమస్యలను సానుకూల దృక్పథంతో త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. పెన్షన్, జీపీఎఫ్, బిల్లుల ఆమోదంలో ఎదురయ్యే ఇబ్బందులను వర్క్‌షాప్‌ల ద్వారా అధిగమించవచ్చన్నారు. నిబంధనలపై స్పష్టత పొందేందుకు డీడీవోలు ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు.కార్యక్రమంలో డిప్యూటీ అకౌంటెంట్ జనరల్స్ ఎం. నరేష్ కుమార్, కె. శశిధర్, ఖమ్మం ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ వై. శ్రీనివాసరెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ జె. మీనాక్షి, ఖమ్మం పీఏఓ రామ్, ఉభయ జిల్లాల అధికారులు, ఉప కోశాధికారులు, ట్రెజరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏఐతో ఉద్యోగ రంగాల్లో సమూల మార్పులు

- **నూతన నైపుణ్యాలతోనే భవిష్యత్తు అవకాశాలు**
- **బీఎస్ఐటీ సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ సీఈఓ భాను చందర్ గరిగెల**



హైదరాబాద్, నవంబర్ 13(పిసిడబ్ల్యూ న్యూస్): కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ – ఏఐ) రానున్న రోజుల్లో దాదాపు అన్ని ఉద్యోగ రంగాల్లోనూ గణనీయమైన మార్పులకు కారణం కానుందని బీఎస్ఐటీ సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) భాను చందర్ గరిగెల అభిప్రాయపడ్డారు. వైద్యం, వ్యవసాయం, విద్య, బ్యాంకింగ్, సమాచార సాంకేతిక (ఐటీ) రంగాలతో పాటు పలు విభాగాల్లో కృత్రిమ మేధ వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో పని విధానాలు పూర్తిగా మారనున్నాయని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం కాచిగూడలో ఏఐ పై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.ఈ నూతన సాంకేతిక పరిజ్ఞానం కారణంగా కొన్ని సంప్రదాయ ఉద్యోగాల స్వరూపం మారే అవకాశం ఉన్నప్పటికీ, మరోవైపు కొత్త ఉద్యోగ అవకాశాలు కూడా భారీగా అందుబాటులోకి వస్తాయని వివరించారు. మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకోవడంతో పాటు, నిరంతరం నూతన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే వారికి భవిష్యత్తులో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని స్పష్టం చేశారు.కృత్రిమ మేధను కేవలం ఒక సాంకేతిక సాధనంగా మాత్రమే చూడకుండా, ఉత్పాదకతను పెంచే ఒక గొప్ప అవకాశంగా పరిగణించాలని సూచించారు. ముఖ్యంగా యువత సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు అర్థం చేసుకుంటూ, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తమ నైపుణ్యాలకు మెరుగులు దిద్దుకోవాలని భాను చందర్ గరిగెల పిలుపునిచ్చారు.

అనాథ వ్యక్తికి కన్నకొడుకులా అంత్యక్రియలు నిర్వహించిన ఆశ్రమ నిర్వాహకుడు మంచికట్ల శ్రీనివాస్



కరీంనగర్,నవంబర్13(పిసిడబ్ల్యూ న్యూస్): జమ్మికుంటకు చెందిన కొండపర్తి చందు కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతుండగా, ఆయన అన్నగారి భార్య స్పందన అనాథ వృద్ధుల ఆశ్రమానికి తీసుకువచ్చారు. అప్పటికే చందు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో ఆశ్రమ నిర్వాహకుడు మంచికట్ల శ్రీనివాస్ కరీంనగర్ ప్రభుత్వ సివిల్ ఆసుపత్రిలో చికిత్స అందించారు. అయినప్పటికీ ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో శుక్రవారం ఉదయం చందు మృతి చెందారు.అనంతరం వెలిచాల వైకుంఠధామంలో స్పందన అనాథ వృద్ధుల ఆశ్రమ నిర్వాహకుడు మంచికట్ల శ్రీనివాస్ స్వయంగా చందు అంత్యక్రియలను నిర్వహించారు.ఆశ్రమం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు సుమారు 18 మంది అనాథలు, అభాగ్యులకు కన్నకొడుకులా స్వయంగా అంత్యక్రియలు నిర్వహించినట్లు శ్రీనివాస్ తెలిపారు. అనాథలు, నిరాశ్రయులు, అభాగ్యులకు ఆశ్రయం కల్పిస్తూ సేవలందిస్తున్న స్పందన అనాథ వృద్ధుల ఆశ్రమాన్ని ప్రభుత్వం గుర్తించి తగిన ప్రోత్సాహం అందించాలని ఆయన కోరారు.

బియ్యం ధరల నియంత్రణపై అధికారుల దృష్టి

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

బియ్యం రకాలను బట్టి గరిష్ఠ ధరల ఖరారు

బీపీటీ,కేఎన్ఎం కిలో రూ.66

తెలంగాణ సోనా రూ.74,యూఎస్ఆర్ రూ.79

వ్యాపార సంస్థల్లో నిరంతర తనిఖీలు

మల్లంపల్లి మండల ఇంచార్జ్ తహసీల్దార్ విజయ్ భాస్కర్

జేడీ మల్లంపల్లి నవంబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్): బియ్యం ధరల పెరుగుదలను నియంత్రించి వినియోగదారులకు అందుబాటు ధరల్లో బియ్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మల్లంపల్లి మండల ఇంచార్జ్ తహసీల్దార్ విజయ్ భాస్కర్ తెలిపారు. బియ్యం రకాలను బట్టి గరిష్ఠ చిల్లర విక్రయ ధరలను ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు.ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం బీపీటీ, కేఎన్ఎం రకం బియ్యం కిలో రూ.66, ఆర్ఎన్ఆర్ (తెలంగాణ సోనా) కిలో రూ.74, యూఎస్ఆర్ రకం బియ్యం కిలో రూ.79గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ ధరలకు మించి ఎవరైనా విక్రయాలు జరిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.మండల పరిధిలోని బియ్యం దుకాణాలు, హోల్‌సేల్ వ్యాపార సంస్థలు, సూపర్ మార్కెట్లలో సంబంధిత శాఖల అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. ఒకే రకమైన బియ్యాన్ని వేర్వేరు బ్రాండ్ల పేర్లతో అధిక ధరలకు విక్రయించకూడదని స్పష్టం చేశారు. బియ్యం ప్యాకెట్లపై గరిష్ఠ చిల్లర ధర తప్పనిసరిగా ముద్రించి ఉండాలని, ప్రతి విక్రయ కేంద్రంలో రకాల వారీగా ధరల పట్టికను ప్రదర్శించాలని సూచించారు.ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే బియ్యం విక్రయించి వినియోగదారులకు సహకరించాలని వ్యాపారులను విజయ్ భాస్కర్ కోరారు. అధిక ధరలకు బియ్యం విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.



మల్లంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ పూర్తి కమిటీ ప్రకటన



మల్లంపల్లి, నవంబర్ 13:(పీసీడబ్ల్యూ న్యూస్): రాష్ట్ర మంత్రి శ్రీమతి దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ మల్లంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ పూర్తి కమిటీని ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా చెరుకుపల్లి శ్రీకాంత్‌రెడ్డి నియమితులయ్యారు.వైస్ ప్రెసిడెంట్లుగా సాదం సాంబయ్య, కనకం రవి, ప్రధాన కార్యదర్శులుగా పసుల సాంబయ్య, బానోతు సురేష్, కోశాధికారిగా ఎండి మోసిన్, అధికార ప్రతినిధిగా తిప్పారపు కిషన్ నియమితులయ్యారు. కార్యదర్శులుగా గవాని ప్రకాష్, భూక్య బాలాజీ, సహాయ కార్యదర్శులుగా భూక్య తుల్జా, భూక్య రాజు, నెమలిపూరి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శులుగా మూల రవీందర్‌రెడ్డి, ఎండి నజీరుద్దీన్‌లను నియమించారు.మండల కమిటీ సభ్యులుగా అమ్మ కొమురయ్య, మాలోతు దుంజ, గుగులోతు బావుసింగ్, శీలం మల్లయ్య, గొల్లన మొగిలి, సింగరబోయిన సమ్మయ్య, ఇటుకాల కర్ణాకర్, మాచర్ల చంద్రమౌళి, బానోతు మోహన్, కనకం భిక్షపతి నియమితులయ్యారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి సీతక్క సహకారంతో ములుగు జిల్లా వ్యాప్తంగా ప్రజా పాలనలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కాంగ్రెస్ పార్టీని మండల స్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభకు పట్టం..

- 11 మంది విద్యార్థులకు ఉద్యోగ భాగ్యం!

- రూ.4 లక్షల వార్షిక వేతనంతో సదర్లాండ్ గ్లోబల్ సంస్థలో కొలువులు

- ప్రథమ సంవత్సరం నుంచే శిక్షణ..

నిరంతర సాధనతో ప్రతిష్టాత్మక సంస్థల్లో ఉద్యోగాలు సాధిస్తున్న శ్రీచైతన్య విద్యార్థులు







ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్) : కళాశాల ప్రాంగణంలో అడుగుపెట్టిన నాటి నుంచి కన్న కలలు.. తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న ఆశలు.. ఉన్నత స్థాయికి చేరుకోవాలనే పట్టుదల.. వీటన్నింటికీ కృషి, పట్టుదల తోడైతే విజయం తప్పక వరిస్తుందని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు నిరూపించారు. స్థానిక పొన్నెకల్లులోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం వర్చువల్ విధానంలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో సదర్లాండ్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన ఉద్యోగాలకు 11 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.4 లక్షల వేతనం లభించనుండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యంలో ఆనందం వెల్లివిరిసింది.ఈ సందర్భంగా సదర్లాండ్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ హెచ్ఆర్ ప్రతినిధి అనూష మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా కమ్యూనికేషన్ నైపుణ్యాలు, కోడింగ్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని సూచించారు. నిరంతర అభ్యాసం, ఆత్మవిశ్వాసం, నైపుణ్యాల పెంపొందింపే ఉద్యోగ రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి ప్రధాన ఆయుధాలని పేర్కొన్నారు.కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని యాజమాన్యం అందిస్తున్న ప్రత్యేక శిక్షణ, ప్రోత్సాహం కారణంగా రికార్డు స్థాయిలో ప్రాంగణ నియామకాలు సాధ్యమవుతున్నాయని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని ప్రముఖ సంస్థలను కళాశాలకు ఆహ్వానించి విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ.. ఉద్యోగాలు సాధించిన 11 మంది విద్యార్థులను అభినందించారు. ప్రతి విద్యార్థి ఒక మంచి ఉద్యోగం సాధించి కుటుంబానికి అండగా నిలవాలన్నదే తమ లక్ష్యమని, వంద శాతం ఉద్యోగ నియామకాల దిశగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట చలపతి మాట్లాడుతూ.. విద్యార్థులను ఉద్యోగాలకు సిద్ధం చేసేందుకు మాక్ ఇంటర్వ్యూలు, సాంకేతిక శిక్షణతో పాటు అవసరమైన నైపుణ్యాలను ప్రథమ సంవత్సరం నుంచే అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ నిరంతర కృషి ఫలితంగానే విద్యార్థులు ప్రతిష్టాత్మక సంస్థల్లో ఉద్యోగాలు సాధిస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ వి. సుదర్శన్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి, టీపీఓ డాక్టర్ రాజేష్, డిప్లొమా ఇన్‌చార్జి కృష్ణ ప్రసాద్, డాక్టర్ సమీరా, డాక్టర్ దిలీప్, రాంబాబు, సురేష్ తదితరులు పాల్గొని ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

670 మందికి చేయూత పెన్షన్ల మంజూరు పత్రాలు



మానకొండూర్, నవంబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్): ఇల్లంతకుంట మండలంలో 670 మంది లబ్ధిదారులకు చేయూత పెన్షన్ల మంజూరు పత్రాలను మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని వైష్ణవ భవన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమన్నారు. చేయూత పెన్షన్ల ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎన్.హెచ్.ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి: ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం





ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్) : నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల సమ్మెపై ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని సిపిఐ రాష్ట్ర నాయకులు, శాసన మండలి సభ్యులు నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. 32 రోజులుగా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఉద్యోగులు చేస్తున్న సమ్మెను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకర మన్నారు. శుక్రవారం కలెక్టరేట్ వద్ద గల ధర్నాచౌక్లో ఎన్.హెచ్.ఎం సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి సత్యం, ఏఐటియుసి నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ.. సమ్మె చేస్తున్న ఉద్యోగులను చర్చలకు పిలవకపోవడం దురదృష్టకరమన్నారు. ఎన్.హెచ్.ఎం ఉద్యోగుల కోర్కెలు గొంతెమ్మ కోర్కెలు కాదని న్యాయబద్ధమైన డిమాండ్లనే ప్రభుత్వం ముందు ఉంచారని ఆయన తెలిపారు. ఎన్.హెచ్.ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని లేదంటే వంద శాతం గ్రాఫ్ శాలరీ ఇవ్వాలని, రూ. 10 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్, 180రోజుల ప్రసూతి సెలవులు, క్యాడర్ గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని ఈ డిమాండ్లు అన్ని న్యాయమైన డిమాండ్లేనని సత్యం తెలిపారు. అసెంబ్లీలో కూడా ఎన్.హెచ్.ఎం సమస్యలపై చర్చిస్తామన్నారు. సమ్మెకు సీపీఐ పూర్తి మద్దతు ప్రకటిస్తుందని గతంలోనే ఎన్.హెచ్.ఎం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని మరోసారి తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, జేఏసి నాయకులు వెంకటేశ్వర్లు, విజయచంద్ర, మానస, అశోక్, విజయలక్ష్మి, మరియమ్మ పాల్గొన్నారు.

ఆక్రమణలో.. ఎర్ర చెరువు

చెరువులు,కుంటలను కాపాడాలంటే హైడ్రా కావాలంటున్న స్థానికులు!

జలవనరులను పెంచాలంటే చెరువులను కాపాడండి అంటున్న గోకవరం మాజీ సర్పంచ్ జమలయ్య










కల్లూరు నవంబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్) : మండలంలో చెరువులు, కుంటల ఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపించి, వాటిని పరిరక్షించేందుకు హైడ్రా తరహా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని గోకవరం మాజీ సర్పంచ్ నల్లగట్ల జమలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ గ్రామంలోని ఎర్రచెరువు ఆక్రమణకు గురైందని అన్నారు. గతంలో తాను సర్పంచ్ గా పనిచేసినప్పుడు అధికారుల సమక్షంలో చెరువుకి సరిహద్దులు నిర్ణయించినట్లు తెలిపారు. కానీ ప్రస్తుతం ఆ చెరువు, అలుగుతో సహా ఆక్రమణకు గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి నీటి ఆధారంగా ఆయకట్టు కింద రైతులు వ్యవసాయం చేస్తున్నారని ప్రస్తుతం ఆక్రమణకు గురి కావడం వల్ల నీటి నిలువ సామర్థ్యం తగ్గి సుమారు 50 ఎకరాలు సాగుకు అవసరమైన నీటిని నిల్వ చేయలేకపోతున్నట్లు వాపోయారు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదని రైతులు వాపోయారు. గ్రామాల్లో చెరువుల ఆక్రమణ వల్ల భవిష్యత్తులో సాగునీటి సమస్యలు, భూగర్భ జలాల కొరత ఏర్పడే ప్రమాదం ఉందని ఇప్పటికే ఎల్ నినో ప్రభావం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోకవరం కాకుండా మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న చెరువులు, కుంటలపై కూడా సమగ్ర విచారణ చేపట్టాలని జమలయ్య కోరారు. ప్రభుత్వ భూములు, చెరువుల శిఖం భూములు, అలుగులు, తూములు ఆక్రమణకు గురయ్యాయా అనే అంశాలపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలని సూచించారు. రేపటి తరాలకు నీటి వనరులను అందించాలంటే చెరువుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. **రీ సర్వేతో సమస్యను పరిష్కరిస్తాం: తహశీల్దార్ బ్రహ్మేశ్వరరావు**

గోకవరం పంచాయతీలోని ఎర్రచెరువు ఆక్రమణకు గురైందని, గ్రామస్తులు సమస్యను వివరించినప్పటికీ స్పందించలేదని సోషల్ మీడియాలో వచ్చిన వార్తలపై స్పందించిన తహశీల్దార్ బ్రహ్మేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో భూ సమస్యలు ఉన్నాయని ప్రస్తుతం మండలంలో భూ రీ సర్వే జరుగుతుందని ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు ఆక్రమించిన వారిపై చర్యలు ఉంటాయని తెలిపారు. నక్ష ప్రకారం గతంలో చెరువు ఎంత విస్తీర్ణంలో ఉన్నదో ముందుగా కేటాయించి తర్వాత సర్వే నిర్వహిస్తామని దాంతో కబ్జాకి గురైన భూములు తిరిగి ప్రభుత్వ స్వాధీనంలోకి తీసుకుంటామని తెలిపారు.

మహబూబాబాద్ జిల్లాలో రైతులకు మోటరైజ్డ్ ట్రైసైకిళ్ల పంపిణీకి ఏర్పాట్లు..

- ఎన్సీఎస్టీ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్ ఆధ్వర్యంలో ఏఎల్ఐఎంసీఓ సీఎస్ఆర్ నిధులతో ప్రత్యేక కార్యక్రమం



మహబూబాబాద్, ప్రతినిధి నవంబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్): రైతులు, ముఖ్యంగా దివ్యాంగులు ,శారీరక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి అండగా నిలుస్తూ వారి జీవన ప్రయాణాన్ని మరింత సులభతరం చేసేందుకు జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ గౌరవ సభ్యులు శ్రీ జాటోతు హుస్సేన్ నాయక్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఇందులో భాగంగా మహబూబాబాద్ జిల్లాలో రైతులకు మోటరైజ్డ్ ట్రైసైకిళ్లను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ నెల 14వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు మహబూబాబాద్ పట్టణంలోని ఎస్ఏ సూరల్, ఈదులపూసపల్లి రోడ్డులో ఉన్న పట్టణం వద్ద ఏఎల్ఐఎంసీఓ వారి సీఎస్ఆర్ నిధులతో మోటరైజ్డ్ ట్రైసైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమానికి జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్ ముఖ్య చొరవతో ఏర్పాట్లు జరుగుతున్నాయి. అనంతరం ఇల్లెందులో జరిగే పలు కార్యక్రమాల్లో కూడా ఆయన పాల్గొననున్నారు.దివ్యాంగులు, అవసరమైన రైతులకు రవాణా సౌకర్యం కల్పించి వారి స్వావలంబనకు తోడ్పడటమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంబంధిత వర్గాలకు పిలుపునిచ్చారు.

బాలాజీ నాయక్ కుటుంబాన్ని పరామర్శించిన డిసిసి అధ్యక్షురాలు ఉమామురళి నాయక్




నెల్లికుదురు నవంబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్): నెల్లికుదురు మండల కేంద్రంలోని రత్తిరాం తండాకు చెందినటువంటి కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలాజీ నాయక్ తండ్రి మరణించడంతో నిన్న వారి యొక్క కుటుంబాన్ని పరామర్శించి వారి యొక్క చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన డిసిసి అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్, డీసీసీ మాజీ అధ్యక్షులు జన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, మహబూబాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్, పరామర్శించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి, వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్ట సమయంలో అధైర్యపడవద్దని, కాంగ్రెస్ పార్టీ మరియు కాంగ్రెస్ ప్రభుత్వం బాలాజీ నాయక్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటాయని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో వివిధ మండలాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు మెంబర్లు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, మండల నాయకులు, పలు మండలాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, పాత్రికేయ మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నపై దాడిని ఖండించిన సతీష్ నాయి

చౌటుప్పల్ నవంబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండల పరిధిలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు తీన్మార్ మల్లన్నపై జరిగిన హత్యాయత్నాన్ని ఆ పార్టీ మునుగోడు నియోజకవర్గ ఇన్చార్జి సికిలమెట్ల సతీష్ నాయి తీవ్రంగా ఖండించారు. బహుజనుల హక్కులు, బీసీల రాజ్యాధికార సాధన కోసం పోరాడుతున్న నాయకులపై భౌతిక దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని అన్నారు. ఇలాంటి దాడులతో బీసీల ఆత్మగౌరవ పోరాటాన్ని అడ్డుకోలేరని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, తీన్మార్ మల్లన్నకు తగిన భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

పేదల సొంతింటి కలకు ఇందిరమ్మ ఇళ్ల భరోసా

● గిరిజన కుటుంబానికి ఇందిరమ్మ ఇంటి కానుక ● ఇందిరమ్మ ఇళ్లతో పేదల కళ్లలో ఆనందం ● గౌరికుంట తండాలో గృహప్రవేశానికి ఎమ్మెల్యే శంకర్



షాద్ నగర్,నవంబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్): నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని షాద్నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్నగర్ మండలం చించోడ్ గ్రామపంచాయతీ పరిధిలోని గౌరికుంట తండాలో నిరుపేద గిరిజన మహిళ అరుణ రాజు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారురాలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ షాద్నగర్ నియోజకవర్గానికి తొలి విడతలో 3,500, రెండో విడతలో మరో 1,500 ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని వెల్లడించారు. చించోడ్ గ్రామానికి 47, గౌరికుంట తండాకు మూడు ఇళ్లు కేటాయించినట్లు తెలిపారు. అర్హులైన పేదలు, గిరిజన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రేషన్ కార్డులు, సన్నబియ్యం, పింఛన్లు వంటి పథకాలను అమలు చేస్తూ పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

ఉత్తరాసుపల్లిలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం





కొందుర్గు,నవంబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్): కొందుర్గు మండలం ఉత్తరాసుపల్లి గ్రామంలో దొడ్వల్లి పావనిశేఖర్ దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుక ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్న దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి గృహప్రవేశం చేశారు.ఈ సందర్భంగా కొందుర్గు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోగురి పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. పేదల సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందన్నారు. అనంతరం పావనిశేఖర్ దంపతులను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి గోవర్ధన్ గౌడ్, మాజీ ఎంపీటీసీలు అంజిరెడ్డి, మల్లేష్ గౌడ్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు రామరాజు, నాయకులు పొట్ట శివకుమార్, వార్డు సభ్యులు కమ్మరి రాజు, మల్లేష్, గణేష్, రవి, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అడ్డుపడితే సహించేది లేదు



పేదలకు సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

డబుల్ బెడ్రూమ్ ఇళ్ల మరమ్మతులకు రూ.7 కోట్లు మంజూరు



షాద్నగర్,నవంబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్): పేద ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. అభివృద్ధి పనులకు ప్రతిపక్షాలు అడ్డుపడితే సహించేది లేదని హెచ్చరించారు. శుక్రవారం ఫరూఖ్నగర్లో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇందిరమ్మ చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.గతంలో పింఛన్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం అర్హుల ఇళ్ల వద్దకే సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా నిలిచిన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల మరమ్మతులు, మౌలిక వసతుల కోసం రూ.7 కోట్లు మంజూరు చేయించినట్లు వెల్లడించారు. త్వరలో రూ.5 లక్షల ఇందిరమ్మ జీవిత బీమా పథకం ప్రారంభం కానుందని తెలిపారు. అర్హులైన పేదలకు ఇళ్లతో పాటు సంక్షేమ పథకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఓడినా.. మనసులు గెలిచిన కోహ్లీ!

- ఆరు వికెట్లు తీసిన మ్యాట్ హెన్రీకి టీమిండియా జెర్సీ బహుమతి..
వైరల్‌గా మారిన వీడియో



న్యూఢిల్లీ: క్రికెట్ మైదానంలో ప్రత్యర్థులపై దూకుడుగా ఆడే టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ.. మైదానం బయట తన ప్రత్యేక వ్యక్తిత్వంతో మరోసారి అభిమానుల మనసులు గెలుచుకున్నాడు. న్యూజిలాండ్‌తో జరిగిన నాలుగో వన్డేలో భారత జట్టు ఘోర పరాజయం పాలైనప్పటికీ, అద్భుత బౌలింగ్‌తో చెలరేగిన కివీస్ పేసర్ మ్యాట్ హెన్రీని కోహ్లీ ప్రత్యేకంగా అభినందించాడు. మ్యాచ్ అనంతరం హెన్రీకి తన టీమిండియా జెర్సీని బహుమతిగా అందజేశాడు. ఈ హృదయపూర్వక సన్నివేశానికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.ఈ మ్యాచ్‌లో మ్యాట్ హెన్రీ భారత బ్యాటర్లకు చుక్కలు చూపించాడు. తన పదునైన బంతులతో టీమిండియా టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. ముఖ్యంగా ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్‌లను డకౌట్ చేసి భారత జట్టుకు కోలుకోలేని దెబ్బతీశాడు. అనంతరం కూడా తన బౌలింగ్‌తో భారత బ్యాటర్లను ఇబ్బంది పెట్టాడు. మొత్తం 9.4 ఓవర్లలో 27 పరుగులు మాత్రమే ఇచ్చి ఆరు వికెట్లు పడగొట్టి న్యూజిలాండ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.అంతకుముందు న్యూజిలాండ్ బ్యాటింగ్‌లో విల్ యంగ్ అద్భుత శతకంతో ఆకట్టుకున్నాడు. 108 బంతుల్లో 125 పరుగులు చేసి జట్టు భారీ స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. దీంతో న్యూజిలాండ్ 333 పరుగుల లక్ష్యాన్ని భారత్ ముందుంచింది. భారీ లక్ష్య ఛేదనలో భారత బ్యాటింగ్ పూర్తిగా విఫలమైంది. హెన్రీ ధాటికి టాప్ ఆర్డర్ కుప్పకూలడంతో పాటు మిగతా బ్యాటర్లు కూడా పెద్దగా ప్రతిఘటించలేకపోయారు. చివరకు భారత్ 89 పరుగులకే ఆలౌటై 244 పరుగుల భారీ తేడాతో ఓటమి చవిచూసింది.అయితే మ్యాచ్ ఫలితంతో సంబంధం లేకుండా కోహ్లీ చూపిన క్రీడాస్ఫూర్తి అందరి దృష్టిని ఆకర్షించింది. తన వికెట్ తీసిన ప్రత్యర్థి బౌలర్‌ను అభినందిస్తూ జెర్సీని బహుమతిగా ఇవ్వడం అతడి గొప్ప మనసుకు నిదర్శనమని అభిమానులు ప్రశంసిస్తున్నారు. ఆటలో గెలుపోటములు సహజమని, ప్రత్యర్థి ప్రతిభను గుర్తించి గౌరవించడం నిజమైన క్రీడాస్ఫూర్తి అని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.మైదానంలో ఎంత దూకుడుగా కనిపించినా, ప్రత్యర్థి ఆటగాళ్ల ప్రతిభను గుర్తించి అభినందించడంలో కోహ్లీ ఎప్పుడూ ముందుంటాడు.

గతంలోనూ పలువురు అంతర్జాతీయ క్రికెటర్లకు తన జెర్సీలను బహుమతిగా అందించిన సందర్భాలున్నాయి. తాజాగా మ్యాట్ హెన్రీకి జెర్సీ అందించడం మరోసారి కోహ్లీ వ్యక్తిత్వాన్ని చాటిచెప్పింది. దీంతో మ్యాచ్‌లో భారత్ ఓడినా.. క్రీడాస్ఫూర్తితో కోహ్లీ అభిమానుల హృదయాలను గెలుచుకున్నాడనే ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

మైనపు విగ్రహంగా హర్మన్‌ప్రీత్ కౌర్!

- జైపూర్‌లో ప్రత్యేక గౌరవం.. మహిళా క్రికెట్‌కు చారిత్రక గుర్తింపు



జైపూర్: భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు అరుదైన గౌరవం దక్కింది. రాజస్థాన్‌లోని జైపూర్ నహర్‌గఢ్ కోటలో ఉన్న హిస్టారికా మ్యూజియంలో ఆమె మైనపు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం (నవంబర్ 13) జరిగిన కార్యక్రమంలో హర్మన్‌ప్రీత్ స్వయంగా తన విగ్రహాన్ని ఆవిష్కరించారు. తొలిసారిగా తన మైనపు ప్రతిమను చూసిన ఆమె ఈ గౌరవం తనకు ఎంతో సంతోషాన్ని, గర్వాన్ని కలిగించిందని తెలిపారు.2025 నవంబర్‌లో హర్మన్‌ప్రీత్ నాయకత్వంలో భారత మహిళా జట్టు తొలిసారిగా వన్డే ప్రపంచకప్‌ను గెలుచుకుని చరిత్ర సృష్టించింది. ఈ అద్భుత విజయానికి గుర్తింపుగా జైపూర్ వైక్స్ మ్యూజియం నిర్వాహకులు ఆమె విగ్రహాన్ని రూపొందించాలని నిర్ణయించారు. సుమారు ఏడాది పాటు శ్రమించి కళాకారులు ఈ విగ్రహాన్ని తయారు చేశారు.ఈ సందర్భంగా హర్మన్‌ప్రీత్ మాట్లాడుతూ.. తన విగ్రహాన్ని ఏర్పాటు చేసిన కళాకారులకు కృతజ్ఞతలు తెలిపారు.

సచిన్ టెండూల్కర్, మహేంద్రసింగ్ ధోనీ వంటి దిగ్గజ క్రికెటర్ల సరసన తన విగ్రహం ఉండటం గొప్ప గౌరవంగా భావిస్తున్నానన్నారు. భవిష్యత్తులో ఈ విగ్రహం యువ క్రికెటర్లకు, ముఖ్యంగా అమ్మాయిలకు స్ఫూర్తినిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రపంచకప్ విజయం మహిళా క్రికెట్‌లో కొత్త అధ్యాయానికి నాంది పలికిందని హర్మన్‌ప్రీత్ పేర్కొన్నారు. 1983లో భారత పురుషుల జట్టు ప్రపంచకప్ గెలిచిన తర్వాత దేశంలో క్రికెట్‌కు ఆదరణ పెరిగినట్లే, మహిళల ప్రపంచకప్ విజయం కూడా మహిళా క్రికెట్ రూపురేఖలను మార్చగలదని అభిప్రాయపడ్డారు. ఈ గౌరవం భారత మహిళా క్రికెట్ విజయానికి మరో గుర్తింపుగా నిలిచింది.



89 పరుగులకే భారత్ చిత్తు..
గంభీర్ తీవ్ర అసంతృప్తి!

- **బ్యాటర్ల వైఫల్యంపై కోచ్ ఆగ్రహం.. ప్రపంచకప్‌కు ముందే గుణపాఠం నేర్చుకోవాలని సూచన**

మౌంట్ మాంగనూయి, నవంబర్ 13: న్యూజిలాండ్‌తో జరిగిన నాలుగో వన్డేలో భారత జట్టు ఘోర పరాజయాన్ని చవిచూసింది. 334 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా కేవలం 89 పరుగులకే కుప్పకూలింది. దీంతో 244 పరుగుల తేడాతో న్యూజిలాండ్ ఘన విజయం సాధించింది. భారత బ్యాటర్ల పేలవ ప్రదర్శనపై ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కీలకమైన మ్యాచ్‌లో బ్యాటర్లు కనీస పోరాటం కూడా చేయకపోవడం జట్టు శిబిరంలో ఆందోళన కలిగించింది.మ్యాచ్ అనంతరం గంభీర్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ క్రికెట్‌లో ఆడలేని బంతులంటూ ఏమీ ఉండవని వ్యాఖ్యానించారు. ప్రత్యర్థి బౌలర్లు మంచి ప్రాంతాల్లో బంతులు వేసినప్పుడు వాటిని సమర్థంగా ఎదుర్కొనే బాధ్యత బ్యాటర్లపై ఉంటుందని స్పష్టం చేశారు. వికెట్లు వరుసగా కోల్పోతూ తక్కువ స్కోరుకే ఆలౌట్ కావడం ఆమోదయోగ్యం కాదని అభిప్రాయపడ్డారు.బ్యాటింగ్‌లో నిలకడ లేకపోవడం జట్టుకు పెద్ద సమస్యగా మారిందని, ప్రతి ఆటగాడు తన బాధ్యతను గుర్తించాలని సూచించారు. క్రీజులో ఎక్కువ సమయం గడపడం, పరిస్థితులకు అనుగుణంగా ఆడటం నేర్చుకోవాలని పేర్కొన్నారు. ప్రత్యర్థి బౌలింగ్‌ను ఎదుర్కొనేందుకు అవసరమైన మానసిక సంసిద్ధతను పెంచుకోవాలని చెప్పారు.వచ్చే ఏడాది దక్షిణాఫ్రికాలో జరగనున్న ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే జట్టు లోపాలను సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉందని గంభీర్ పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులు ప్రపంచకప్‌లోనూ ఎదురయ్యే అవకాశం ఉందని, వాటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు ఆటగాళ్లు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ ఘోర పరాజయం భారత జట్టుకు హెచ్చరికగా మారింది.

యువ ఒలింపిక్స్‌లో అంబేకర్ చరిత్ర!

- భారత్‌కు తొలి బాక్సింగ్ స్వర్ణం..
ఐర్లాండ్ బాక్సర్‌పై ఉత్కంఠ విజయం



డకార్, నవంబర్ 13: యువ ఒలింపిక్స్ బాక్సింగ్‌లో భారత యువ క్రీడాకారుడు ఎల్. అంబేకర్ మీతై చరిత్ర సృష్టించాడు. సెనెగల్‌లోని డకార్‌లో జరుగుతున్న 2026 యువ ఒలింపిక్స్‌లో పురుషుల 50 కిలోల విభాగంలో స్వర్ణ పతకం సాధించాడు. ఐర్లాండ్‌కు చెందిన క్రిస్టియన్ జుబానీతో జరిగిన ఫైనల్ పోరులో 3-2 తేడాతో విజయం సాధించి భారత్‌కు ఈ పోటీల చరిత్రలో తొలి బాక్సింగ్ స్వర్ణాన్ని అందించాడు.మణిపూర్‌కు చెందిన అంబేకర్ ఫైనల్‌లో ఆరంభం నుంచే గట్టి పోటీ ఎదుర్కొన్నాడు. తొలి రౌండ్‌లో ప్రత్యర్థి ఆధిపత్యం ప్రదర్శించినప్పటికీ, రెండో రౌండ్ నుంచి అంబేకర్ పుంజుకున్నాడు. చివరి రౌండ్‌లో మరింత దూకుడుగా ఆడి న్యాయనిర్ణేతల మద్దతు పొందాడు. దీంతో 3-2 స్ప్లిట్ నిర్ణయంతో విజయం ఖరారు చేసుకున్నాడు. ఫైనల్‌కు చేరుకునే క్రమంలోనూ అంబేకర్ అద్భుత ప్రదర్శన చేశాడు. క్వార్టర్ ఫైనల్‌లో నమీబియా బాక్సర్ అబ్రహం కలెంగాను తొలి రౌండ్‌లోనే ఓడించాడు. సెమీఫైనల్‌లో కొలంబియాకు చెందిన ఇజోన్ జెఫ్రీ గలియా అరెవాలోపై 5-0తో ఘన విజయం సాధించి ఫైనల్‌కు చేరుకున్నాడు.ఈ విజయంతో యువ ఒలింపిక్స్ బాక్సింగ్‌లో భారత్ ఎన్నడూ సాధించని ఘనతను అంబేకర్ అందించాడు. గతంలో 2010 యువ ఒలింపిక్స్‌లో శివ థాపా రజతం, వికాస్ కృష్ణన్ కాంస్య పతకం సాధించగా.. ఇప్పుడు అంబేకర్ స్వర్ణం గెలిచి భారత బాక్సింగ్ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖించాడు. మరోవైపు భారత మహిళా బాక్సర్ గుంజన్ కూడా 48 కిలోల విభాగంలో స్వర్ణం సాధించడంతో భారత బాక్సింగ్‌కు ఒకే రోజు రెండు పతకాలు దక్కాయి.

అర్ష్‌దీప్‌కు ఒకేరోజు డబుల్ ధమాకా!



న్యూఢిల్లీ, నవంబర్ 13: టీమిండియా పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌కు ఒకేరోజు రెండు శుభవార్తలు అందాయి. ఐపీఎల్ ట్రేడింగ్‌లో భాగంగా పంజాబ్ కింగ్స్ నుంచి ముంబై ఇండియన్స్ జట్టులోకి మారిన అతడు.. మరోవైపు తన ప్రేయసి, నటి సమ్రీన్ కౌర్‌తో నిశ్చితార్థం చేసుకున్నాడు. దీంతో అర్ష్‌దీప్ ఆనందంలో మునిగిపోయాడు.ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు జరిగిన ట్రేడింగ్‌లో అర్ష్‌దీప్ సుమారు రూ.18 కోట్ల ఒప్పందంతో ముంబై ఇండియన్స్ జట్టులోకి వెళ్లాడు. గత ఎనిమిది సీజన్లుగా పంజాబ్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహించిన అతడు, ఇప్పుడు కొత్త జట్టుతో తన ప్రయాణాన్ని కొనసాగించనున్నాడు.మరోవైపు న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న అర్ష్‌దీప్ తన చిరకాల ప్రేయసి సమ్రీన్ కౌర్‌తో నిశ్చితార్థం చేసుకున్నాడు. ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలను ఇద్దరూ సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. అర్ష్‌దీప్ మోకాళ్లపై కూర్చొని సమ్రీన్‌కు ఉంగరం తొడుగుతున్న ఫొటోలు అభిమానులను ఆకట్టుకున్నాయి. దీంతో క్రికెట్ అభిమానులు, పలువురు ప్రముఖులు ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.సమ్రీన్ కౌర్ నటి, మోడల్‌గా గుర్తింపు పొందింది. ఫెమినా మిస్ ఇండియా పోటీల్లో పాల్గొన్న ఆమె పలు హిందీ, పంజాబీ చిత్రాలు, సంగీత వీడియోల్లో నటించింది. ఇలా ఒకేరోజు క్రికెట్ కెరీర్‌లో కొత్త మలుపు, వ్యక్తిగత జీవితంలో కొత్త బంధం ఏర్పడటంతో అర్ష్‌దీప్‌కు ఈ రోజు ప్రత్యేకంగా నిలిచింది.

సచిన్ రికార్డును సమం చేసిన విరాట్ కోహ్లీ!

న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో డకౌట్.. వన్డేల్లో 20వ సారి
ఖాతా తెరవకుండానే వెనుదిరిగిన స్టార్ బ్యాటర్



మౌంట్ మాంగనూయి, నవంబర్ 13: టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఖాతాలో అనుకోని రికార్డు చేరింది. న్యూజిలాండ్‌తో జరిగిన నాలుగో వన్డేలో పరుగులేమీ చేయకుండానే పెవిలియన్ చేరిన కోహ్లీ.. భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న అనవసర రికార్డును సమం చేశాడు. వన్డే క్రికెట్‌లో భారత్ తరఫున అత్యధికసార్లు డకౌట్ అయిన ఆటగాళ్ల జాబితాలో సచిన్‌తో కలిసి అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఈ మ్యాచ్‌లో కోహ్లీ నాలుగు బంతులు ఎదుర్కొని పరుగులేమీ చేయకుండానే న్యూజిలాండ్ పేసర్ మాట్ హెన్రీ బౌలింగ్‌లో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. న్యూజిలాండ్ నిర్దేశించిన 334 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన భారత జట్టుకు ఆరంభంలోనే గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఓపెనర్ రోహిత్ శర్మ తొలి బంతికే డకౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కోహ్లీపై అభిమానులు భారీ ఆశలు పెట్టుకున్నప్పటికీ, అతడు కూడా ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరడంతో భారత శిబిరంలో నిరాశ నెలకొంది. మాట్ హెన్రీ తన బౌలింగ్‌తో భారత టాప్ ఆర్డర్‌ను తీవ్రంగా ఇబ్బంది పెట్టాడు. మొదట బయటకు వెళ్తున్న బంతులతో కోహ్లీని పరీక్షించిన హెన్రీ, ఆ తర్వాత లోపలికి దూసుకొచ్చే బంతితో అతడిని బోల్తా కొట్టించాడు. కోహ్లీ బ్యాట్‌ను దాటిన బంతి నేరుగా వికెట్లను పడగొట్టింది.ఈ వికెట్‌తో వన్డే క్రికెట్‌లో కోహ్లీ డకౌట్ల సంఖ్య 20కి చేరింది.

సచిన్ టెండూల్కర్ తన వన్డే కెరీర్‌లో 463 మ్యాచ్‌లు ఆడి 20 సార్లు పరుగులేమీ చేయకుండానే ఔటయ్యాడు. కోహ్లీ మాత్రం 321 మ్యాచ్‌ల్లోనే ఈ సంఖ్యను చేరుకోవడం గమనార్హం. ఇద్దరూ ఒకే సంఖ్యలో డకౌట్లు నమోదు చేసినప్పటికీ, కోహ్లీ తక్కువ మ్యాచ్‌ల్లోనే ఈ రికార్డును సమం చేశాడు.భారత్ తరఫున వన్డేల్లో అత్యధిక డకౌట్ల జాబితాలో కోహ్లీ, సచిన్ చెరో 20 డకౌట్లతో తొలి స్థానంలో ఉండగా, మాజీ బౌలర్ జవగళ్ శ్రీనాథ్ 19 డకౌట్లతో తర్వాతి స్థానంలో ఉన్నాడు. అనిల్ కుంబ్లే, రోహిత్ శర్మ చెరో 18 సార్లు డకౌట్ అయ్యారు. క్రికెట్ చరిత్రలో ఎన్నో గొప్ప రికార్డులు సాధించిన కోహ్లీకి ఈ రికార్డు మాత్రం చేదు అనుభవంగా మిగిలింది. న్యూజిలాండ్ బౌలర్ల ధాటికి భారత టాప్ ఆర్డర్ కుప్పకూలడం, కీలక ఆటగాళ్లు త్వరగా వికెట్లు కోల్పోవడం జట్టు ప్రదర్శనపై ప్రశ్నలు లేవనెత్తింది.



తెలుగు ఆడియన్స్ పల్స్ పట్టేసిన దుల్కర్..

మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ తెలుగు.. ప్రేక్షకులకు బాగా దగ్గరవుతున్నారు. కొంతమంది తెలుగు హీరోల కన్నా కూడా ఈయనకి అభిమానులు ఎక్కువగా ఉండటం విశేషం. అయితే దీనికి కారణం కేవలం సినిమాలు మాత్రమే కాదు. ఆయన ఎంచుకునే కథలు, పాత్రలు, అభిమానులతో మెలిగే విధానం కూడా అయింది తెలుగు ప్రేక్షకులకు ఎక్కువ దగ్గర చేస్తున్నాయి. సాధారణంగా ఒక భాషకు చెందిన హీరో మరో భాషలో గుర్తింపు తెచ్చుకోవాలంటే అక్కడి ప్రేక్షకులకు చాలా దగ్గర అవ్వాలి. వారి అభిరుచులకు తగ్గ సినిమాలు చేయడంతో పాటు, సినిమా ప్రమోషన్లకు కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వాలి. ఈ విషయం దుల్కర్ సల్మాన్ బాగా అర్థం చేసుకున్నారు. తెలుగు సినిమాలు చేస్తున్నప్పటి నుంచే ఇక్కడి ప్రేక్షకులతో అనుబంధాన్ని పెంచుకోవడానికి ఆయన ప్రయత్నిస్తున్నారు. ఇంటర్వ్యూలలో తెలుగులో మాట్లాడుతూ ఉండడం.. సినిమా ప్రమోషన్లలో చురుగ్గా పాల్గొనడం ఆయనకు మరింత ప్లస్ అవుతోంది. మరోవైపు దుల్కర్ సల్మాన్ తీసే సినిమాలు కూడా.. ఆయనకు పాపులారిటీ పెంచుతూనే వస్తున్నాయి . హీరో అంటే భారీ యాక్షన్ సన్నివేశాలు, ఎలివేషన్లు ఉండాలనే లెక్కలకు దుల్కర్ ఎక్కువగా ప్రాధాన్యత ఇవ్వరు. కథలో తన పాత్రకు ఎంత ప్రాధాన్యత ఉంది, ఆ పాత్ర ప్రేక్షకుల మనసుల్లో ఎంతకాలం నిలిచిపోతుంది అనే విషయాలపై దృష్టి పెడతారు. అందుకే మహానటి, సీతారామం, లక్కీ భాస్కర్ వంటి విభిన్నమైన సినిమాలతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఇప్పుడు ఆకాశంలో ఒక తార సినిమాతో మరోసారి తెలుగు ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. నవంబర్ 20న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సినిమా కూడా చాలావరకు.. దుల్కర్ సల్మాన్ గత తెలుగు సినిమాల లాగానే.. కంటెంట్ చాలా స్ట్రాంగ్ గా ఉండేలా కనిపిస్తోంది. నిజానికి మరో భాషలో స్టార్‌డమ్ సంపాదించడం అంత సులభం కాదు. కానీ దుల్కర్ తన సినిమా సెలక్షన్, తన ప్రమోషన్ స్ట్రాటజీ ద్వారా.. ఈ విషయాన్ని తేలిక గానే చేసేసారు. ఇక ఇదే విషయం మన తెలుగు హీరోలు కూడా దుల్కర్ సల్మాన్ దగ్గర నుంచి నేర్చుకోవడం చాలా అవసరం.

అల్లు అర్జున్ భార్య స్నేహారెడ్డికి అరుదైన గౌరవం

'బౌలీ ఆర్ట్ సంఘం' చైర్‌పర్సన్‌గా అల్లు స్నేహారెడ్డి నియామకం



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ భార్య, వ్యాపారవేత్త అల్లు స్నేహారెడ్డికి కళా, సాంస్కృతిక రంగాల్లో అరుదైన గౌరవం దక్కింది. ప్రతిష్టాత్మక 'బౌలీ ఆర్ట్ సంఘం' కల్చర్ అండ్ హెరిటేజ్ విభాగానికి ఫౌండింగ్ చైర్‌పర్సన్‌గా ఆమె నియమితులయ్యారు. భారతదేశంలోనే మొట్టమొదటి 'స్టెప్‌వెల్ ఆర్ట్ బినాలే'గా గుర్తింపు పొందిన ఈ ఉద్యమానికి ఆమె ప్రధాన సారథిగా వ్యవహరించనున్నారు.

దక్కన్ ప్రాంతంలో, ముఖ్యంగా హైదరాబాద్ పరిసరాల్లో ఉన్న పురాతన మెట్ల బావుల (బావోలీలు) చారిత్రక, పర్యావరణ విశిష్టతను నేటి తరానికి చాటిచెప్పడమే ఈ సంస్థ ప్రధాన లక్ష్యం. 'ది రెయిన్‌వాటర్ ప్రాజెక్ట్'కు చెందిన కల్పనా రమేశ్, 'ఏక్ చిత్ర'కు చెందిన అన్నపూర్ణ మాదిపాడిగ సంయుక్తంగా ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు. ఈ పురాతన బావులను కళా వేదికలుగా తీర్చిదిద్ది ప్రజల్లో అవగాహన పెంచేందుకు స్నేహారెడ్డిని ఈ ప్రాజెక్ట్ ముఖచిత్రంగా ఎంపిక చేశారు.

ఈ క్రమంలో డిసెంబర్ 1వ తేదీ నుంచి జనవరి 10 వరకు దాదాపు 40 రోజుల పాటు భారీ స్థాయిలో బౌలీ ఆర్ట్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. బన్సీలాల్‌పేట్, గోల్కొండ, రాష్ట్రపతి నిలయం, ఫలక్‌నుమా తదితర 13కు పైగా చారిత్రక ప్రాంతాల్లో 200 మందికి పైగా కళాకారులతో ప్రదర్శనలు, చర్చలు ఏర్పాటు చేయనున్నారు.ఈ బాధ్యతలపై స్నేహారెడ్డి స్పందిస్తూ... "బౌలీ ఆర్ట్ సంఘంలో ఈ కొత్త బాధ్యత చేపట్టడం చాలా సంతోషంగా ఉంది. మన నగరం యొక్క చరిత్ర, వారసత్వ సంపదపై ముఖ్యంగా యువతరంలో మరింత అవగాహన పెంచేందుకు ఈ ప్రాజెక్ట్ ఒక గొప్ప వేదికగా నిలుస్తుంది. భావితరాల కోసం మన సంస్కృతిని కాపాడే దిశగా ఇది ఒక అర్థవంతమైన అడుగు" అని పేర్కొన్నారు.


క్యాన్సర్‌ను జయించిన మోనాల్ గజ్జర్

సర్జరీ తర్వాత ఎమోషనల్ పోస్ట్!



సినిమా తారల జీవితాలు బయటకు ఎంతో అందంగా కనిపిస్తాయి. కానీ కెమెరా వెనుక వారు ఎదుర్కొనే వ్యక్తిగత సమస్యలు.. ఆరోగ్య ఇబ్బందులు చాలామందికి తెలియవు. తాజాగా టాలీవుడ్ నటి.. బిగ్‌బాస్ ఫేమ్ మోనాల్ గజ్జర్ తన ఆరోగ్యానికి సంబంధించిన విషయాన్ని వెల్లడించి అభిమానులను షాక్‌కు గురిచేశారు. తనకు పాపిల్లరీ థైరాయిడ్ క్యాన్సర్ ఉన్నట్లు వైద్య పరీక్షల్లో తేలిందని.. ఈ మధ్యనే శస్త్రచికిత్స చేయించుకున్నట్లు ఆమె సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ప్రస్తుతం సర్జరీ విజయవంతంగా పూర్తయిందని..క్రమంగా కోలుకుంటున్నానని తెలిపారు. ూశ్రీంశీ =ష్ణఎ – రాజమౌళి ఆలోచన సరైనదేనా? మోనాల్ గజ్జర్ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేక పరిచయాలు అవసరం లేదు. అల్లరి నరేష్ హీరోగా నటించిన సుడిగాడు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ఆమె, ఆ తర్వాత బ్రదర్ ఆఫ్ బొమ్మాలి వంటి చిత్రాల్లోనూ నటించి గుర్తింపు తెచ్చుకున్నారు. సినిమాలతో పాటు టెలివిజన్ రంగంలోనూ తనదైన ముద్ర వేశారు. ముఖ్యంగా తెలుగు బిగ్‌బాస్ సీజన్ 4లో పాల్గొనడంతో ఆమెకు మరింత పాపులారిటీ వచ్చింది. ఈ షో ద్వారా బుల్లితెర ప్రేక్షకులకు కూడా దగ్గరయ్యారు. అనంతరం బెల్లంకొండ శ్రీనివాస్ నటించిన అల్లుడు అదుర్స్ సినిమాలో ఒక ఐటమ్ సాంగ్లో కనిపించి అలరించారు. అయితే తాజాగా ఆమె పంచుకున్న ఆరోగ్య సమాచారం మాత్రం అభిమానులను కలచివేసింది. తనకు పాపిల్లరీ థైరాయిడ్ క్యాన్సర్ ఉన్నట్లు గుర్తించడంతో వైద్యుల సలహా మేరకు ఆపరేషన్ చేయించుకున్నట్లు మోనాల్ తెలిపారు. ఈ సమస్యను ఎదుర్కొని ప్రస్తుతం కోలుకుంటున్నానని చెప్పడం అభిమానులకు కొంత ఊరటనిచ్చింది. తన ఆరోగ్య పరిస్థితి గురించి బహిరంగంగా మాట్లాడటం ద్వారా క్యాన్సర్‌పై అవగాహన కల్పించే ప్రయత్నం కూడా చేశారు. ఈ క్రమంలో ఈ నటి..జీవితంలో కెరీర్, కుటుంబం, ఇతర బాధ్యతలతో ఎంత బిజీగా ఉన్నా ఆరోగ్యాన్ని మాత్రం నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. శరీరంలో ఏవైనా అసాధారణ మార్పులు కనిపించినా, ఆరోగ్యంపై సందేహాలు ఉన్నా ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని కోరారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం కూడా ఎంతో అవసరమని గుర్తుచేశారు. అంతేకాదు, మహిళల్లో క్యాన్సర్ నివారణపై అవగాహన పెంచేందుకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రాముఖ్యతను కూడా ప్రస్తావించారు. ముఖ్యంగా సర్వైకల్ క్యాన్సర్ నివారణకు సంబంధించి సరైన వైద్య సలహా తీసుకోవాలని తెలిపింది. ఆమె చేసిన పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.

కంగనా రనౌత్ 'స్కేరీ పిక్చర్' టైటిల్ పోస్టర్ విడుదల చేసిన రానా దగ్గుబాటి.. బాలీవుడ్ లో రవిబాబు ఎంట్రీ



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న హారర్ చిత్రం 'స్కేరీ పిక్చర్'. ఈ సినిమాకు సంబంధించిన టైటిల్ పోస్టర్‌ను ప్రముఖ నటుడు రానా దగ్గుబాటి ఈరోజు అధికారికంగా విడుదల చేశారు. సురేష్ ప్రొడక్షన్స్, ఫ్లయింగ్ ఫ్రాగ్స్, స్పిరిట్ మీడియా పతాకాలపై దగ్గుబాటి సురేష్ బాబు, రవిబాబు ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

తెలుగులో 'అనసూయ', 'అవును' వంటి విభిన్నమైన హారర్ థ్రిల్లర్లతో మెప్పించిన దర్శకుడు రవిబాబు, ఈ సినిమా ద్వారా హిందీ చిత్రసీమలోకి దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. రానా దగ్గుబాటి తన సోషల్ మీడియా ఖాతా ద్వారా ఈ టైటిల్ పోస్టర్‌ను పంచుకుంటూ... "ఒక కొత్త పీడకల మొదలుకాబోతోంది" అని పేర్కొన్నారు.భారతదేశంలో హారర్ కథలకు మంచి ఆదరణ ఉందని, దేశంలోని విభిన్న ప్రాంతాల భయాలు, కథలను వెండితెరపైకి తెచ్చే దర్శకులకు సురేష్ ప్రొడక్షన్స్, స్పిరిట్ మీడియా ద్వారా నిరంతర మద్దతు అందిస్తామని రానా తెలిపారు. సైకలాజికల్, క్రీచర్, హారర్-కామెడీ వంటి అన్ని రకాల సబ్-జోనర్లను ప్రోత్సహించేలా ఒక ప్రత్యేక వ్యవస్థను నిర్మించడమే తమ లక్ష్యమని ఆయన వివరించారు.గతంలో 'రాజ్: ది మిస్టరీ కంటిన్యూస్', 'చంద్రముఖి 2' వంటి చిత్రాలలో నటించిన కంగనా రనౌత్, మరోసారి ఈ పూర్తి స్థాయి హారర్ చిత్రంతో ప్రేక్షకులను భయపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సినిమాను 2027లో థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం స్పష్టం చేసింది. పూర్తి తారాగణం, విడుదల తేదీకి సంబంధించిన ఇతర వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారు.

ఏకంగా 22 కిలోల బరువు తగ్గిన కీరవాణి ఎక్స్‌లో పంచుకున్న అనుపమ్ ఖేర్



ఆస్కార్ విజేత, ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి శారీరకంగా పూర్తిగా మారిపోయాడు. ఏకంగా 22 కిలోల బరువు తగ్గి అందరినీ ఆశ్చర్యపరిచాడు. తాజాగా హైదరాబాద్‌లో ఆయనను కలిసిన బాలీవుడ్ సీనియర్ నటుడు అనుపమ్ ఖేర్ ఈ మార్పును చూసి ఫిదా అయ్యాడు. కీరవాణి పట్టుదల, క్రమశిక్షణ నిజంగా స్ఫూర్తిదాయకమంటూ ప్రశంసలు కురిపించాడు. బరువు తగ్గిన తర్వాత ఆయన మరింత ఉత్సాహంగా, ఆత్మవిశ్వాసంతో కనిపిస్తున్నాడని కొనియాడాడు. హైదరాబాద్ పర్యటనలో కీరవాణిని కలిసిన అనుపమ్ ఖేర్.. ఆ సందర్భానికి సంబంధించిన కొన్ని ఫొటోలను తన 'ఎక్స్' ఖాతాలో పంచుకున్నాడు. కీరవాణి 22 కిలోల బరువు తగ్గడం అద్భుతమైన విషయమని పేర్కొన్నాడు. ఆయన నడకలోనూ కొత్త ఉత్సాహం కనిపించిందని, ఎంతో సంతోషంగా, ఆత్మవిశ్వాసంతో ఉన్నాడని తెలిపాడు. సంగీతంలో అద్భుతాలు సృష్టించిన కీరవాణి.. ఇప్పుడు పట్టుదల, ఏకాగ్రతతో ఏదైనా సాధించవచ్చని నిరూపించాడని ప్రశంసించాడు. ఆయన జీవితంలో ప్రారంభమైన ఈ కొత్త ప్రయాణం మరింత విజయవంతం కావాలని ఆకాంక్షించాడు.